# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :123 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 16-07-2025 | పేజీలు:4 వెల: 2.00


## సమాజంలో మీడియా పాత్ర ప్రత్యేకమైనది

వికారాబాద్, జులై 15 : సమాజంలో మీడియా పాత్ర ప్రత్యేకమైనదని, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకొచ్చే బాధ్యత మీడియాపై ఉందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్ లో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన వార్త ల్యాబ్ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో మీడియా రంగం రోజురోజుకు ముందుకు సాగుతుందని, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, యూట్యూబ్ ఛానల్, తదితర రంగాల్లో పోటీ ప్రపంచం నెలకొందన్నారు. ప్రభుత్వం చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో తెలపాల్సిన బాధ్యత మీడియాకు ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైని కలెక్టర్ హర్ష చౌదరి, పి ఐ బి అధికారి శృతి, తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి-బనకచర్లపై చర్చ అనుచితం : తెలంగాణ సర్కార్



హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య నెలకొన్న జల వివాదాల పరిష్కారం కోసం కేంద్రం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను చర్చకు ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం తెలంగాణ, ఎపి సిఎంలు కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్‌తో సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రానికి తెలంగాణ సర్కార్ లేఖ రాసింది. సమావేశంలో బనకచర్లపై చర్చించాలని ఎపి సింగిల్ ఎజెండా ఇచ్చింది. అయితే రేపటి భేటీలో బనకచర్లపై చర్చ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం లేఖలో పేర్కొంది. కృష్ణాపై పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులను ప్రభుత్వం అజెండాగా ప్రతిపాదించింది. పాలమూరు, డిండి ప్రాజెక్టులకు జాతీయహోదాను ప్రభుత్వం అజెండాగా పంపించింది. ఇచ్చంపల్లి ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని ప్రభుత్వం కోరింది. 200 టిఎంసిల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మించాలని ప్రతిపాదించింది. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టిఎంసిలు కేటాయించాలని పేర్కొంది. బనకచర్లపై జిఆర్ఎంబి, సిడబ్ల్యూసి, ఇఎసి, అభ్యంతారాలు తెలిపాయని ప్రభుత్వం తెలిపింది. బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవని లేఖలో ప్రస్తావించింది. బనకచర్ల విషయంలో చట్టాలు, ట్రైబ్యునల్ తీర్పుల ఉల్లంఘన జరుగుతోందని, ఆ ప్రాజెక్టుపై చర్చించాల్సిన అవసరమే లేదని తెలంగాణ సర్కార్ పేర్కొంది. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకుపై చర్చించడం అనుచితమని ప్రభుత్వం తెలిపింది. ఇలాంటి చర్యలు కేంద్ర నియంత్రణ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తాయంది.

## కోర్టు ఆదేశాల మేరకు త్వరలో పంచాయతీ ఎన్నికలు ...

బిక్కనూరు, జులై 15: హైకోర్టు ఆదేశాల మేరకు త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. మంగళవారం కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలంలో ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక అభివృద్ధి కుంటు పడుతుందని చెప్పారు. గ్రామాల అభివృద్ధి పంచాయతీ కార్యదర్శుల పై పడడంతో వారు సరైన అభివృద్ధి చేయలేకపోతున్నారని తెలిపారు. కేంద్రం నుండి సరైన నిధులు రాకపోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో పనులు చేసిన కాంట్రాక్టర్ల కు బిల్లులు చెల్లించకపోవడంతో ప్రస్తుతం తమపై భారం పడుతుందని చెప్పారు. అయినప్పటికీ ఎన్ని ఇబ్బందులైనా కాంట్రాక్టర్లకు బిల్లు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం ఒక కమిటీని సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఉచిత ఇసుక ప్రభుత్వం సరఫరా చేస్తుందని తెలిపారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ ఒకపక్క సంక్షేమం, మరోపక్క అభివృద్ధితో పాటు కాంట్రాక్టర్లకు చెల్లించవలసిన బిల్లులు చెల్లిస్తూనే ప్రభుత్వం ముందుకు



పోతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వారికి బిల్లులు రాగానే తిరిగి సంఘాలకు డబ్బులు చెల్లించవలసి ఉంటుందని ఆమె చెప్పారు. ఈసమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమ్ రెడ్డి పలువురు నాయకులు ఉన్నారు.

## మేం నిరక్షరాస్యులం కాదు.. మమ్మల్ని మోసం చేయలేరు!

హైదరాబాద్,తాము నిరక్షరాస్యులం ఏమీ కాదని.. బీసీ రిజర్వేషన్లు, ఆర్డినెన్స్ గురించి తెలుసు అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పక్క రాష్ట్రాల్లో రిజర్వేషన్లను న్యాయస్థానాలు కొట్టి వేసాయని, తమ్మల్ని మోసం చేయాలని చూస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల కోసం అవసరం అయితే కర్నాటక వెళ్లి సీఎం సిద్ధ రామయ్యతో చర్చిస్తాం అని పేర్కొన్నారు. ఇంజనీరింగ్, మెడికల్ అడ్మిషన్లు జరుగుతున్నాయని.. మరి వాటికి బీసీ రిజర్వేషన్ల జీవో ఎందుకు ఇవ్వలేదని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ.. ఈ నెల 10న రాష్ట్ర కేబినెట్? నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. బీసీ డెడికేటెడ్ కమిషన్ బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసే పనిలో పడింది. 'కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను ఒక బీసీ ముఖ్యమంత్రి సిద్ధ రామయ్యతో చెప్పించారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని అప్పుడు కాంగ్రెస్ నేతలు పెద్ద నాయకులతో చెప్పించారు. బీసీ రిజర్వేషన్ల కోసం అవసరం అయితే కర్నాటక వెళ్లి సిద్ధ రామయ్యతో చర్చిస్తాం. నాడు 33 శాతం రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తే.. స్వప్న రెడ్డితో కేసు వేయించి కొట్టి వేయించారు. మేము నిరక్షరాస్యులం కాదు.. బీసీ రిజర్వేషన్లు, ఆర్డినెన్స్ గురించి తెలుసు. పక్క రాష్ట్రాల్లో రిజర్వేషన్లను న్యాయస్థానాలు కొట్టివేశాయి. మమ్మల్ని మోసం



చేయాలని చూస్తే ఖబడ్దార్. మీ మాటలతో పిచ్చి వాళ్లను, హౌలా గాళ్లను చేయకండి. కేబినెట్‌లో యాదవ్, గొల్ల కురుమలకు స్థానం లేదు. ఒక జీవోతో రిజర్వేషన్లు ఇస్తామనడం మోసం. అలా ఒక జీవోతో రిజర్వేషన్లు వచ్చేది ఉంటే ఇన్ని ఉద్యమాలు, గొడవలు ఎందుకు అవుతున్నాయి. 42 శాతం రిజర్వేషన్లు కల్పించి చట్టబద్ధత కల్పించకుంటే మిమ్మల్ని రాజకీయంగా భూస్థాపితం చేస్తాం. ఇంజనీరింగ్, మెడికల్ అడ్మిషన్లు జరుగుతున్నాయి. వాటికి బీసీ రిజర్వేషన్ల జీవో ఎందుకు ఇవ్వలేదు' అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు.

## ఏదో ఒకటి చేయాల్సిందే.. సోషల్ మీడియా అభ్యంతరకర పోస్టులపై సుప్రీం



న్యూఢిల్లీ,సోషల్ మీడియాలో కొందరు యూట్యూబర్లు, స్టాండప్ కమెడియన్లు, కళాకారులు ఇష్టానుసారం అభ్యంతరకర పోస్టులు చేస్తున్నారని సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అలాంటి పోస్టుల కట్టడికి తప్పనిసరిగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. సోషల్ మీడియాలో ఏం చేసినా.. ఏం చెప్పినా చెల్లిపోతుందనే ధోరణి పలువురిలో కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి ఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయని మండిపడింది. ప్రధాని నరేంద్రమోదీ, ఆరెస్సెస్‌పై వేసిన కార్టూన్ అభ్యంతరకరంగా ఉండటంతో తనపై నమోదైన కేసులో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కార్టూనిస్టు హేమంత్ మాలవీయ వేసిన పిటిషన్‌పై విచారణ సమయంలో సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. భావ ప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగం చేయవద్దని హెచ్చరిస్తూ.. కార్టూనిస్టు హేమంత్ మాలవీయకు అరెస్టు నుంచి సుప్రీం కోర్టు రక్షణ కల్పించింది. అయితే ఇదే విధంగా సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులను షేర్ చేస్తే..చట్టంప్రకారం అతడిపై చర్యలు తీసుకునే అధికారం రాష్ట్రానికి ఉందని జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం హెచ్చరించింది. ప్రధాని నరేంద్రమోదీ, ఆరెస్సెస్‌పై వేసిన కార్టూన్ అభ్యంతరకరం గా ఉండటంతో కార్టూనిస్టు హేమంత్ మాలవీయపై న్యాయవాది, ఆర్ఎస్ఎస్ కార్యకర్త వినయ్ జోషి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదయ్యింది. మాలవీయ సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన విషయాలను అప్‌లోడ్ చేయడం ద్వారా హిందువుల మతపరమైన మనోభావాలను దెబ్బతీశారని జోషి ఆరోపించారు. ఈ కేసులో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ.. హేమంత్ మాలవీయ మధ్యప్రదేశ్ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా.. న్యాయస్థానం దానిని తోసిపుచ్చడంతో ఆయన సుప్రీంను ఆశ్రయించారు.

## భూకంపం తెప్పిస్తా.. రేవంత్‌కు తలసాని వార్నింగ్!



హైదరాబాద్, జూలై 15: తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శల దాడికి దిగారు. ఇటీవల రాష్ట్రంలో రేవంత్ సర్కార్ చేపట్టిన కులగణన లెక్కల్లో అనేక తప్పులు ఉన్నాయని ఆరోపించారు. హడావుడిగా అసెంబ్లీలో బీసీ బిల్లు ప్రవేశపెట్టి కేంద్రానికి పంపారని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం కేంద్రంపై రేవంత్ ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావటం లేదని ధ్వజమెత్తారు. తెలంగాణలో బీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు కాకుంటే భూకంపం సృష్టిస్తామని హెచ్చరించారు.

మేము యాచకులం కాదు.. సీఎం సాబ్!

ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీసీలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల అమలు చేయమంటే ఇప్పుడు ఆర్డినెన్స్ అంటున్నారని...అలాంటప్పుడు బిల్లు ఎందుకు ప్రవేశ పెట్టారని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చి పార్లమెంటులో ఆమోదిస్తేనే చట్టబద్ధత వస్తుందని అన్నారు. 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను అడుక్కోవడానికి తాము యాచకులం కాదని..ఇది మా బీసీల హక్కు అని అన్నారు.

## డ్రగ్స్ దందాలో పోలీసు అధికారి కుమారుడు!?

హైదరాబాద్,హైదరాబాద్ డ్రగ్స్ దందాలో ఎస్ఐబీ అధికారి కుమారుడి పాత్రను ఈగిల్ అధికారులు గుర్తించారు. మల్నాడు రెస్టారెంట్ యజమాని సూర్య అమ్మినేని అరెస్టు తర్వాత పోలీసులు ఆ నెట్ వర్క్ పై దర్యాప్తు చేస్తున్న సందర్భంగా ఎస్ఐబీ అధికారి కుమారుడి పాత్ర తెరపైకి వచ్చింది. ఈ వ్యవహారం ఈగిల్ అధికారులను షాక్ కు గురి చేసింది. ఈ పోలీసు అధికారి కొడుకు పాత్ర పై ఆరా తీస్తున్న క్రమంలో మరికొన్ని విషయాలు బయటపడ్డాయి. 2024లో ఎస్ఐబీ అధికారి కుమారుడు డ్రగ్స్ వ్యవహారంలో ఓ సారి పట్టుబడినా పోలీసులు అరెస్టు చేయకుండా వదిలేసిన విషయం కూడా ఈగిల్ అధికారులు గుర్తించారు. ఈ ఎస్ఐబీ పోలీస్ అధికారి ప్రస్తుతం ఓఎస్డీ గా ఎస్ఐబీ లోనే కొనసాగుతున్నారు. ఈ ఎస్ఐబీ అధికారిని ఫోన్ టాపింగ్ కేసులో ప్రాథమికంగా అనుమానించినప్పటికి ఆ తర్వాత ఆయన అప్రూవర్ గా మారాన్న ప్రచారం జరిగింది. ఫోన్ టాపింగ్ కేసులో ఈ అధికారి వాంగ్మూలాన్ని కూడా నమోదు చేసినట్లు చెబుతున్నారు. అదలా ఉంటే తాజాగా ఆయన కుమారుడి పేరు డ్రగ్స్ వ్యవహారంలో ప్రముఖంగా వినిపిస్తోంది. డ్రగ్స్ వ్యవహారంలో మల్నాడు రెస్టారెంట్ యజమాని సూర్య అమ్మినేనితో పాటు అరెస్టు అయిన ఆరుగురిని ఈగిల్ అధికారులు కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ విచారణలో మరికొంత మంది సెలబ్రిటీలతో పాటు ప్రముఖుల చిట్టా బయటపడే అవకాశం ఉందని అంటున్నారు. ఈగిల్ అధికారులు వారం రోజుల కిందట వారికి అందిన సమాచారం మేరకు కొంపల్లి లోని మల్నాడు కిచెన్ రెస్టారెంట్ యజమాని సూర్య అమ్మినేని తో పాటు మరో ఆరుగురిని అరెస్టు చేశారు. ఈ సందర్భంలో ఈగిల్ పోలీసులకు రాహుల్ తేజ గురించి తెలిసింది. అతడి గురించి ఆరా తీసినప్పుడు 2024 జనవరిలో నిజామాబాద్



పోలీసులు కూడా డ్రగ్స్ కేసులో ఏ3 నిందితుడిగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ఇప్పటి వరకూ అరెస్టు చేయలేదు. కాగా ఈగిల్ అధికారుల దర్యాప్తులో రాహుల్ తేజ డ్రగ్స్ సరఫరాదారనీ, అతడు డ్రగ్స్ ను ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ ల నుంచి తీసుకువచ్చేవాడని గుర్తించారు. అలాగే ఈగిల్ దర్యాప్తులో రాహుల్ తేజ ఎస్ఐబీ లో రిటైర్ అయ్యి , ప్రస్తుత్తం ఓఎస్డీగా పని చేస్తున్న ఓ అధికారి కుమారుడని తేలింది. దీంతో ఈగిల్ అధికారులు ఈ వ్యవహారాన్ని సీరియస్ గా తీసుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఎస్ఐబీ అధికారి కుమారుడి వ్యవహారాన్ని ప్రభుత్వం దృష్టి కి తీసుకువెళ్లి అతని పై చర్యలకు తీసుకునేందుకు ఈగిల్ అధికారులు రెడీ అవుతున్నారు. అయితే తాజాగా సూర్య అమ్మినేని కేసులో అరెస్టు చేస్తారా లేదా నిజామాబాద్ కేసులలో అరెస్టు చేస్తారా అనేది చూడాల్సి ఉంది.

## కేంద్ర మంత్రి గడ్కరీ ప్రోటోకాల్ ఉల్లంఘించారు..

బెంగుళూరు: కర్నాటకలోని శివమొగ్గంలో సోమవారం సింగందూర్ బ్రిడ్జ్‌ను కేంద్ర మంత్రి గడ్కరీ ప్రారంబించారు. దేశంలోనే రెండవ అతిపెద్ద కేబుల్ బ్రిడ్జ్ అది. ఆ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగినట్లు ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య సోమవారం ప్రధాని మోదీకి లేఖ రాశారు. కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కార్యక్రమంలో పాల్గొన్నారని, రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించకుండా ఆ కార్యక్రమాన్ని నిర్వహించని, ఎటువంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా తన పేరును ఆహ్వానం పత్రికలో వాడినట్లు సీఎం సిద్ధరామయ్య పాత్ర. రాష్ట్ర ప్రభుత్వం అయిష్ట'త వ్యక్తం చేసినా.. కేంద్ర మంత్రి కేబుల్ బ్రిడ్జ కార్యక్రమంలో పాల్గొన్నారని, ఇది స'మాఖ్య ప్రక్రియ విస్మరించినట్లు' అవుతుందని సూచిస్తుంది. టెక్నికల్ రిపోర్టు ప్రకారం ఆ ప్రాజెక్టు పూర్తి కాలేదని, దాన్ని ఓపెన్ చేయకుండా ఉండాల్సి ఉంది.కేంద్ర మంత్రి గడ్కరీ సోమవారం కర్నాటకలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఉంది. సింగందూర్ బ్రిడ్జ ఓపెనింగ్ కార్యక్రమాన్ని సీఎం సిద్ధరామయ్యతో పాటు ఆయన కేబినెట్ బహిష్కరించింది. జూలై 11వ తేదీన గడ్కరీతో మాట్లాడని, ఆ ప్రోగ్రామ్‌ను వాయిదా వేయాలని కోరానని సీఎం గుర్తు చేశారు. వాయిదా చేస్తాన'ని మంత్రి అంగీకరించార'ని, కానీ గుట్టు చప్పుడు కాకుండా ఆ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించినట్లు సీఎం సిద్ధరామయ్య తన లేఖలో పత్రాలు.సుమారు రెండు వేల కోట్ల విలువైన రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారని, తమకు చెప్పకుండానే ఆ కార్యక్రమాలు నిర్వహించారని ప్రధానానికి రాసిన లేఖలో సీఎం వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా మంత్రి గడ్కరీ ప్రోటోకాల్‌ను ఉల్లంఘించార'ని, ఆహ్వాన పత్రికలో మాజీ సీఎం బీఎస్ యడ్యూ రప్ప పేరును ముందుగా



ప్రచురించారని,ప్రస్తుత డిప్యూటీ సీఎం, స్పీకర్ పేర్లను ప్రచురించలే దని గుర్తింపు. కేంద్ర మంత్రి గడ్కరీ చర్యలను ఖండిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నామని, భవిష్యత్తు లో ఇలాంటి మళ్లీ జరగకుండా చూడాలని కోరుతున్నట్లు లేఖలో తెలియజేశారు.

### దేవాదుల నార్త్ కెనాల్ ద్వారా సాగు నీటిని విడుదల చేయాలి

భీమదేవరపల్లి, ధర్మసాగర్ నార్త్ కెనాల్ ద్వారా సాగునీటిని వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు మండల సురేందర్ డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా చింతగట్టు క్యాంపు రైతులతో కలిసి అధికారులకు వినతి పత్రం ఏర్పాటు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పొలాల్లో నార్లు పోసుకొని నెల రోజులు గడుస్తున్నా దేవాదుల నీళ్లు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నీటి లభ్యత లేకపోవడంతో నార్లు ఎండి ముదిరి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## రాహుల్‌గాంధీపై బీజేపీ కౌంటర్ ఎటాక్



న్యూఢిల్లీ,ఒడిశా రాష్ట్రం బాలాసోర్ లో లైంగిక వేధింపులు తాళలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజకీయరంగు పులుముకుంది. ఆ విద్యార్థినిది ముమ్మాటికి అధికారి బీజేపీ సిస్టమ్ చేసిన హత్యేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ఆరోపించారు. ధైర్యంగా వేధింపుల విషయం బయటపెట్టిన విద్యార్థినికి న్యాయం చేయకుండా.. ఆమెను బెదిరింపులకు గురిచేసి ఆత్మహత్యకు పురికొల్పారని విమర్శించారు. దాంతో రాహుల్‌గాంధీకి బీజేపీ కౌంటర్ ఇచ్చిం ది.విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటనపై రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేయడం దురదృష్టకరమని బీజేపీ విమర్శించింది. ఇంతటి సున్నితమైన అంశాన్ని రాహుల్‌గాంధీ రాజకీయ అస్త్రంగా వాడుకుంటున్నాడని, అది ఆయన చీప్ మైండ్‌సెట్‌కు నిదర్శనమని మండిపడింది. ఈ మేరకు కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు పెట్టారు.దేశంలోని ఆడబిడ్డల భద్రతకు, న్యాయం చేసేందుకు ప్రధాని మోదీ, బీజేపీ అహర్నిశలు అవసరమైన చర్యలు తీసుకుంటోందని, కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఎప్పుడూ రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతోందని ధర్మేంద్ర ప్రధాన్ విమర్శించారు. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు మృతురాలి కుటుంబాన్ని కించపర్చేలా ఉన్నాయని, ఆయన వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.కాగా ఒడిశా రాష్ట్రం బాలాసోర్‌లోని ఫకీర్ మోహన్ (అటానమస్) కాలేజీలో ఇంటిగ్రేటెడ్ బీఈడీ సెకండియర్ చదువుతున్న విద్యార్థిని గత శనివారం ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

## సంపాదకీయం

**బుధవారం 16-07-2025**

# జీవకళ కోల్పోతున్న ఉజ్జయినీ క్షిప్రా

మానవ కార్యకలాపాలు, వాతావరణ మార్పులు, ప్రభుత్వ యంత్రాంగాల నిర్లక్ష్యం కలగలిసి నదుల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అనేక జీవనదులు నేడు జలసిరిని కోల్పోతున్నాయి. ఉజ్జయినీ మహాకుంభమేళా జరిగే క్షిప్రా నది దుస్థితే ఇందుకు ఉదాహరణ. ఇలాంటి నదుల పునరుజ్జీవానికి ప్రభుత్వాలు గట్టి పూనిక వహించాలి.మధ్యప్రదేశ్‌లోని వింధ్య పర్వత శ్రేణిలో కక్రిబర్డి కొండల్లో ఉద్భవించిన క్షిప్రా నది- 190 కిలోమీటర్లు ప్రవహించి రాజస్థాన్ సరిహద్దు సమీపంలోని చంబల్ నదిలో కలుస్తుంది. పౌరాణికంగా ఎంతో ప్రాధాన్యమున్న ఈ నదిని 'షిప్రా' అనీ పిలుస్తారు. ప్రసిద్ధ ఉజ్జయినీ క్షేత్రముండేది ఈ నదీ తీరంలోనే. దీంతోపాటు ధార్, దేవాస్, మహిద్‌పుర్, బార్‌నగర్, అలోట్, సన్వర్, మౌ, ఖచ్రోడ్ పట్టణాల నీటి అవసరాలను కూడా క్షిప్రా నదే తీరుస్తోంది. పన్నెండేళ్లకోసారి ఇక్కడ సింహస్థ కుంభమేళా నిర్వహిస్తారు. 2016లో జరిగిన ఉజ్జయినీ కుంభమేళాలో దాదాపు ఏడున్నర కోట్ల మంది పాల్గొన్నారు. 2028లో జరిగే పవిత్ర స్నానాలకు 45కోట్ల మంది రావచ్చని అంచనా. దాంతో క్షిప్రా నదిలో తగినంత నీటి ప్రవాహం ఉండేలా చూడటం పెనుసవాలుగా మారింది. మహా కుంభమేళా కోసమేకాదు- పారిశ్రామిక, గృహ, సాగు అవసరాలకూ నదిలో నీరు పారేలా చూడాల్సి ఉంది.

నర్మదాతో తాత్కాలిక అనుసంధానం

క్షిప్రాలో 1970 దశకం వరకూ నిత్యం జల ప్రవాహం ఉండేది. సేద్యానికి అతిగా నీటిని తోడేయడం, వర్షపాతం తగ్గడం, అడవుల నరికివేత, వాతావరణ మార్పులు దీనికి శాపంలా పరిణమించాయి. ఇప్పుడిది ఏడాదిలో అయిదారు నెలలే ప్రవహిస్తోంది. ఈ నదిపై నిర్మించిన సాహిబ్‌ఖేడీ, కాజీఖేడీ వంటి ప్రాజెక్టులు 3,703 చదరపు కిలోమీటర్ల మేర సాగునీటి అవసరాలు తీరుస్తున్నా- నదీ ప్రవాహం ముందుకెళ్లకుండా అడ్డుకుంటున్నాయి. దీంతో ఉజ్జయిని వంటి చోట్ల తాగునీటి ఎద్దడి తీవ్రమవుతోంది.2016 ఉజ్జయినీ కుంభమేళా సందర్భంగా నర్మదా జలాలను క్షిప్రాలోకి మళ్లించారు. ఇందుకు రూ.432 కోట్లు వెచ్చించారు. విద్యుత్తుతో నడిచే రెండు పంప్ స్టేషన్లను ఏర్పాటుచేసి, నీటిని 350 మీటర్ల ఎత్తువరకు తీసుకెళ్లాల్సి వచ్చింది. ఎలాగోలా ఉజ్జయిని దగ్గర నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించడంతో పవిత్రస్నానాలకు అవకాశం కలిగింది. తదుపరి క్షిప్రా కుంభమేళా 2028 ఏప్రిల్, మే నెలల్లో జరగనుంది. ఇటీవల ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన కుంభమేళాకు పెద్దసంఖ్యలో భక్తులు వచ్చారు. క్షిప్రా కుంభమేళాకు అంతకంటే ఎక్కువమంది తరలిరావచ్చు కాబట్టి- మళ్లీ ఈ నదిని నర్మదాతో తాత్కాలికంగా అనుసంధానించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కానీ, సమస్యకు ఇది సరైన పరిష్కారం కాదు. క్షిప్రాకు జీవకళను సహజంగా తీసుకురావాలేగానీ, కృత్రిమంగా నీటిని పారించడం సరికాదన్నది పర్యావరణవేత్తల సూచన. వాతావరణ మార్పులకు తోడు పాలనా పరమైన నిర్లక్ష్యమే క్షిప్రా దుస్థితికి కారణమన్న 'కాగ్' నివేదిక- ఈ నదీ పర్యావరణాన్ని పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పింది. సమీపంలోని పట్టణాల నుంచి శుద్ధిచేయని మురుగు, పరిశ్రమల నుంచి వ్యర్థ రసాయనాలు వచ్చి నదిలో కలవడం, కాలుష్యం పెచ్చుమీరడం వంటి అంశాలను ప్రస్తావించింది. ప్రవాహానికి అవరోధాల్లేకుండా చూసేందుకు దీర్ఘకాలిక చర్యలు అవసరమని హితవు చెప్పింది.

ఇది దేశవ్యాప్త సమస్య

భారత్ నేడు తీవ్ర జల సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అధిక ఉష్ణోగ్రతల వల్ల మంచు పర్వతాలు శరవేగంగా కరిగిపోతూ అకాల వరదలకు కారణమవుతున్నాయి. మరోవైపు గంగా, యమునా వంటి నదులు కుంచించుకు పోతున్నాయి. నదీ పరీవాహకాల్లో తాగు, సాగునీటి అవసరాలకు భూగర్భ జలాలను ఎక్కువగా తోడేస్తుండటం, పారిశ్రామిక వ్యర్థాల పారబోత వంటివి అక్కడి పర్యావరణాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. క్షిప్రా పరీవాహకంలో నాలుగైదేళ్లకు ఒకసారి కరవు కాటకాలు సంభవిస్తున్నాయి. దాంతో ఈ ప్రాంతాన్ని కరవుకు ఆస్కారమున్న ప్రాంతంగా ప్రకటించారు. దీనికితోడు ఉజ్జయిని, ఇందోర్ జిల్లాల్లో భూగర్భ జలాలను భారీగా తోడేస్తున్నారు. రుతుపవనాల ఆధారంగా ప్రవహించే క్షిప్రా వంటి నదుల్లో భూగర్భ నీటిమట్టాలు నిర్దిష్ట స్థాయిలో ఉన్నప్పుడే ప్రవాహం సజావుగా సాగుతుంది. రుతుపవన కాలంలో నదీ గర్భం కంటే ఉపరితలంపైనే నీరుఎక్కువగా ఉంటుంది. అప్పుడు భూగర్భ జలాలు రీఛార్జ్ అవుతాయి. భూగర్భ నీటిమట్టాలు పెరిగిన తరవాత ఉపరితల జలాలు తగ్గినా నదీ ప్రవాహం కొనసాగుతూనే ఉంటుంది. కానీ, నీటిని అతిగా వినియోగిస్తుండటం వల్ల నదీ గర్భాల్లో జలమట్టాలు గణనీయంగా పడిపోతున్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి పచ్చదనాన్ని పెంపొందించాలి. అటవీ ప్రాంతాల్లో దట్టమైన పచ్చదనం పెంపకం భూగర్భ జలాల పెంపునకు ఎంతగానో ఉపకరిస్తుంది. మరోవైపు, నదుల సమగ్ర నిర్వహణ, పరిరక్షణకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలి. ప్రజల భాగస్వామ్యంతో భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలి.

# ఉపాధి హామీ చట్టాన్ని సంరక్షించుకుందాం



హైదరాబాద్,గ్రామీణ భారతంలో కుల, మత, లింగ బేధం లేకుండా అన్ని రకాల ప్రజలకు వారి జీవన హక్కులను బలోపేతం చేయడానికి 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (దాన్ని నరేగా అని కూడా పిలుస్తున్నారు) పార్లమెంటులో ఆమోదించబడి చట్టంగా తయారైంది. మొట్టమొదటి యుపిఏ ప్రభుత్వ కాలంలో వామపక్షాల సంపూర్ణ మద్దతుతో రూపొందించబడింది. 2014లో బిజెపి కేంద్రంలో అధికారం చేజిక్కించుకోగానే ఉపాధి చట్టానికి తూట్లు పొడవడం మొదలు పెట్టి దాని స్ఫూర్తిని నాశనం చేయడానికి చర్యలు చేపట్టింది. పార్లమెంటులో తయారైన శాసనానికి ఏ విధమైన చర్చ లేకుండా దానికి మార్పులు చేయడం ద్వారా%ౌ%చట్టం స్ఫూర్తినేకాక భారత ప్రజాస్వామ్య స్ఫూర్తిపై కూడా ఆ పార్టీ దాడి చేయడం ప్రారంభించింది.

ఉపాధిపై బిజెపి దాడి

అధికారంలోనికి వచ్చిన నాటి నుండి బిజెపి ఉపాధి హామీ చట్టం స్ఫూర్తిని నీరుగార్చడానికి అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నది.మొదటిది: మొట్టమొదట పథకం ప్రవేశ పెట్టినపుడు కేంద్ర బడ్జెట్లో నాలుగు శాతం నిధులు అంటే 2.5 లక్షల కోట్లు కేటాయించగా తర్వాత వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం 1.37 శాతం (రూ.86 వేల కోట్లు) మాత్రమే కేటాయించింది. అంతేకాక గతేడాది కేటాయింపుల కంటే ఈ సంవత్సరపు కేటాయింపులు పెరగకపోగా కేటాయించిన పూర్తి బడ్జెట్‌ను కూడా ఈ పథకానికి వినియోగించడంలో పూర్తిగా విఫలమైంది. చట్టం ప్రకారం రకరకాల కారణాలచేత కనీసం వంద పని దినాలు కల్పించడంలో విఫలమవుతుండగా బడ్జెట్ కేటాయింపులు ఈ పరిస్థితిని మరింత దిగజార్చుతున్నాయి. ఈ ఏడాది సగటున కల్పించిన పని దినాలు 50.23 కాగా గత ఆర్థిక సంవత్సరం ముందు అది 52.8 గా ఉంది. అంటే రానురానూ బిజెపి ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నదనడంలో సందేహం లేదు.రెండవది: నమోదైన కూలీల పేర్లు అర్ధాంతరంగా తొలగించడం. గత సంవత్సరానికి ముందు ఉపాధి పథకానికి 25.2 కోట్ల మంది నమోదు కాగా ఆధార్ ఆధారిత ధ్రువీకరణ తర్వాత ఆ సంఖ్య 18.28 కోట్లకు తగ్గింది. అంతమందినే ప్రభుత్వం ఈ పథకానికి అర్హులుగా నిర్ధారించింది. బిజెపి ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఆధార్ ఆధారిత చెల్లింపు విధానం ప్రవేశపెట్టిన నాటి నుండి ఈ పరిస్థితి నెలకొన్నది. ఒకపక్క గ్రామీణ భారతంలో కొన్నేళ్లుగా నిరుద్యోగం, ఉపాధి లేమి పెరుగుతుండగా ఉపాధి కల్పించే జాబు కార్డుల తొలగింపు కూడా పని దినాల తగ్గింపుకు దారితీసింది. 2020 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం 389.09 కోట్ల పనిదినాలు కల్పించగా గత ఆర్థిక సంవత్సరంలో కేవలం 286.26 కోట్ల పనిదినాలు మాత్రమే కల్పించింది.మూడవది: ఉపాధి హామీ చట్టం అమలులోకి వచ్చిన కొత్తలో దళిత ఆదివాసీల అసైన్డ్ భూములను అభివృద్ధిపరిచే పని బాగా ప్రోత్సహించడం జరిగింది. ఫలితంగా గ్రామీణ, వ్యవసాయ ఆర్థిక పరిస్థితుల్లో కొంతమేరకు వృద్ధి కనబడింది. కాగా తర్వాత వచ్చిన బిజెపి ప్రభుత్వం గ్రామీణ ప్రాంత భూములపై కాక పట్టణ ప్రాంత భూముల అభివృద్ధిపై దృష్టి సారించింది. గతంలో 65 శాతం నిధులు వ్యవసాయ లేదా దాని అనుబంధ కార్యకలాపాలకు వినియోగించితే నేడు అది 46.74 శాతానికి పడిపోయింది. మరొక ముఖ్యమైన డిమాండ్ ఉపాధి వ్యవసాయ పనులను అనుసంధానించడం. ఉపాధి పనులను పెంచడానికి బదులుగా బిజెపి ప్రభుత్వం గ్రామీణ నిరుపేద రైతు కూలీలను భూస్వాముల ధనికుల భూముల్లో పని చేయమని బలవంతం చేస్తున్నది. తద్వారా గ్రామీణ ధనవంతులతో రైతు కూలీల బేరసారాల శక్తి తగ్గిపోయింది పనిదినాల సంఖ్య కూడా తగ్గిపోయింది. ఉపాధి చట్టానికి మరిన్ని తూట్లు పొడుస్తూ బిజెపి సర్కార్ రాష్ట్రాలకున్న నిర్ణయాత్మక శక్తి లేకుండా కేవలం కొద్ది సంఖ్యలో మాత్రమే పని దినాల కేటాయింపుకు తెగబడింది.నాలుగవది: ఉపాధి హామీ చట్టం అమలులో రైతు కూలీలకు పని దినాలు తగ్గే విధంగా యంత్ర సాంకేతికతను ప్రోత్సహించడం, సామాగ్రి విడి భాగాల కొనుగోలు ఖర్చును ఈ నిధుల నుండే ఖర్చు చేయడం జరిగింది. ఈ పథకం ప్రవేశపెట్టిన కొత్తలో కేవలం పది శాతం మాత్రమే వస్తువులు విడిభాగాలకు కేటాయించారు. మిగిలిన నిధులు రైతు కూలీల జీతాలు చెల్లింపులకు వినియోగించారు కానీ నేడు అది 36 శాతానికి పెరిగింది. యంత్రాల వాడకం కూడా పెరిగింది. పర్యవసానంగా రైతు కూలీల బదులు యంత్రాలు సాంకేతికత వినియోగం పెరిగి పని దినాలు పడిపోయాయి.ఐదవది: ఈమధ్య ఉపాధి రైతు కూలీలకు రెండు నుండి ఏడు శాతం వేతనం మాత్రమే పెంచడం కేవలం వారిని స్పష్టంగా ఈ పనులకు దూరంగా ఉంచడమే. వారి శ్రమ దోపిడీకి పాల్పడడమే. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 300 నుండి 307కు పెరగగా బీహార్‌లో 245 నుండి 255కు కేరళలో 346 నుండి 349కి వారి వేతనాలు పెరిగాయి. ఈ రకమైన పెంపు చేసినప్పుడు పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని జీవన వ్యయాన్ని గమనంలోనికి తీసుకోకపోవడం సిగ్గుచేటు. ఉపాధి చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన జీతాన్ని కేంద్రం కూడా అమలు పరచాలి. కేరళ ప్రభుత్వం 800 రూపాయలు నిర్ణయించగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది చాలా తక్కువగా ఉండటం శోచనీయం.

నిధులు ఇవ్వకుండా నీరుగార్చే కుట్ర

ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం త్రైమాసిక నిధులుగా రూ.29,803 కోట్లు గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖకు విడుదల చేసింది. ఇందులో రూ.19,226 కోట్లు మాత్రమే రాష్ట్రాలకు కేటాయించింది. పనిచేసిన రైతు కూలీలకు 14 రోజుల్లోగా చెల్లింపులు జరగాలి కానీ ఇప్పటికీ లక్షలాది మందికి సకాలంలో చెల్లింపులు జరగక అవస్తలు పడుతున్న పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం పూర్తిగా కేటాయించిన నిధులను రాష్ట్రాలకు విడుదల చేయకపోవడం దారుణం. బిజెపి ఈ విధంగా నిరుపేదలపై దాడికి పూనుకోగా కొన్ని రాష్ట్రాలు గ్రామాలను పట్టణీకరించే పనిలో అత్యుత్సాహం చూపుతున్నాయి. వాటిని మున్సిపాలిటీలలో కలుపుతున్నాయి. ఉపాధి చట్టం పట్టణాలకు వర్తించదు కాబట్టి ఆ చట్టం అమలు కొన్నిచోట్ల ప్రశ్నార్థకం అవుతున్నది. ఇది కేవలం పంచాయతీల్లోని గ్రామాలకు మాత్రమే వర్తిస్తుంది. అంటే ఇది చట్టాన్ని నీరుగార్చే కుట్రలో మరో భాగం. పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ నాయకత్వంలోని ప్రభుత్వంలో అవినీతి పేరుకుపోయిందనే సాకుతో గత మూడేళ్లుగా ఆ రాష్ట్రానికి కేంద్రం ఉపాధి నిధులు విడుదల చేయడం లేదు. నిధులు ఆపి గ్రామీణ కూలీలను ఇబ్బంది పెట్టిన కేంద్రం తీరును ఇటీవల కలకత్తా హైకోర్టు తప్పుపట్టింది. ఉపాధి గ్రామీణ ప్రజల హక్కు అని తేల్చిచెబుతూ 2025 ఆగష్టు ఒకటినుంచి ప్రారంభించాలని ఆదేశాలు జారీచేసింది.

సంఘటిత ఉద్యమాలే శరణ్యం

ప్రపంచ బ్యాంకు నిబంధనల ప్రకారం మూడు డాలర్ల కన్నా తక్కువ ఆదాయం ఉన్నవారు అత్యంత నిరుపేదలు. ఉపాధి హామీ చట్టం అమలు కారణంగా గ్రామీణ పేదలు అంతకన్నా ఎక్కువ ఆదాయం పొందడంతో అత్యంత నిరుపేదల లిస్టు నుండి వారు బయటపడ్డారు. కానీ ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ అమల్లోకి రావడంతో తిరిగి వారు మళ్లీ పేదరికంలోనికి నెట్టి వేయబడుతున్నారు. కేంద్రం విధానాల వల్ల నేటి గ్రామీణ భారతంలో నిరుపేదలకు, ధనస్వాములకు ఒక వైరుధ్యం ఏర్పడుతున్నది. ఈ అంతరాలను తొలగించడానికి మనం గ్రామీణ నిరుపేదల పక్షాన నిలవాలి. వారిని సంఘటిత పరిచి ముందుకు నడిపించాలి. అందుకుగాను కేంద్రం ఉపాధి బడ్జెట్‌ను రూ 2.5 లక్షల కోట్లకు పెంచేలా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తేవాలి. అలాగే ఏడాదికి 200 పనిదినాలు కల్పించేలా, కనీస వేతనం రూ.600గా నిర్ణయించేలా పోరాటాలు చేయాలి. అప్పుడు మాత్రమే గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సంరక్షించుకోగలం. ఇది నేటి ఆవశ్యకత.

# రైతన్నతో వరుణుడి దోబూచులాట..


న్యూఢిల్లీ,ఈ ఖరీఫ్ సీజన్ లో ముందుగా రుతుపవనాలు ప్రారంభమైనప్పటికీ ఆశించిన స్థాయి వర్షాలు కురువకపోవడంతో తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు పంట సగం సాగు లక్ష్యాన్ని మాత్రమే చేరుకుంది. ఈ నెల మొదటి వారానికి రాష్ట్ర వ్యాప్తంగా 57,02,011 ఎకరాల్లో మాత్రమే వివిధ రకాల పంటల సాగు ప్రారంభమైంది. ఈ ఖరీఫ్ సీజన్ లో సాధారణ సాగు లక్ష్యం 1,32,44,305 ఎకరాలు ఉండగా సగం మాత్రమే సాధ్యమైంది. వర్షాలు కురువకపోవడంతో పంట సాగు జాప్యమవుతోంది. గత ఏడాది ఈ సమయంతో పోల్చితే లక్ష్యాన్ని అధిగమించారు. గత ఏడాది ఈ సమయానికి 56,19,751 ఎకరాల్లో సాగు చేయగా ఈ సీజన్ లో లక్ష్యాన్ని 56,26,243 ఎకరాలుగా నిర్దేశించుకోగా ఆ లక్ష్యం మాత్రం అధిగమించారు. గత ఖరీఫ్ తో పోల్చితే లోటువర్షపాతం నమోదుకావడంతో అనుమానాలు తలెత్తుతున్నాయి. ఆశచావని అన్నదాతలు మాత్రం మొగులుదిక్కు కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు.

వరుణునిపై రైతన్న భారం

గత ఏడాది సగటు వర్షపాతం 923.8 మి.మీ కాగా, నైరుతిరుతుపవనాల సాధారణ వర్షపాతం 740.6 మి.మీ ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన జూన్ మొదటి నుంచి నేటి వరకు సాధారణ వర్షపాతం 185.4 మిమిలు ఉండగా ఇప్పటి వరకు 165.5 మి.మి మాత్రమే కురిసింది. -11 మి.మి లోటు నెలకొన్నది. జూన్ నెలలో సాధారణ వర్షపాతం నమోదుకాగా, జూలైలోనే లోటు ఏర్పడింది. ఈ వానకాలంలో నైరుతి రుతుపవనాలు వారం రోజుల ముందే ప్రారంభమై మురిపించినప్పటికీ తదుపరి ముఖం చాటేశాయి.23 జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైంది. 10 జిల్లాలో తక్కువ వర్షాలు కురిశాయి. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, మెదక్, సిద్ధిపేట,వరంగల్, హనుమకొండ,మహబూబాబాద్, ములుగు, ఖమ్మం,భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్, నారాయణపేట, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. మంచిర్యాల,పెద్దపల్లి, సంగారెడ్డి, జయశంకర్‌భూపాలపల్లి, జనగామ, మేడ్చల్, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి,హైదరాబాద్ జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో వర్షాలు పడగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో వర్షపాతం అత్యల్పంగా నమోదైంది.

సాగులో వరి, పత్తి వైపు మొగ్గు

రాష్ట్రంలో రైతులు ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ వానకాలం సీజన్ లో కూడా వరి, పత్తి పంటల వైపు మొగ్గు చూపారు. తగిన వర్షపాతం, నీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వరిసాగు చేపట్టగా మిగిలిన వర్షాధారంతో పాటు స్వంత నీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో పత్తి, మొక్కజొన్న,



కంది, పెసర పంటలకు ప్రాధాన్యమిచ్చారు. పూర్తి వర్షాధార ప్రాంతాల్లో జొన్న ఇతర మెట్టపంటల వైపు రైతులు మొగ్గు చూపారు. ఇప్పటి వరకు వరి 40,3,109 ఎకరాల్లో, పత్తి 38,34,146 ఎకరాల్లో, మొక్కజొన్న 22,6,054 ఎకరాల్లో, జొన్న 36,008 ఎకరాల్లో, కంది 4,61,432 ఎకరాల్లో, పెసర 6,0548 ఎకరాల్లో సాగు చేశారు. మొత్తం నూనెగింజల సాగు 3,35,550 ఎకరాల్లో, పప్పు ధాన్యాలు 5,44,992 ఎకరాల్లో సాగు చేశారు. వరి, బెంగాల్ శెనగ, వేరుశెనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు,ఆముదం పంటలు 25 సాగు చేశారు. కంది, పెసర, ఉలువలు, పొగాకు, చెరుకు పంటలు 26 నుంచి 50శాతం సాగుచేశారు. జొన్న, సోయాబీన్, పత్తి పంటలు మాత్రం 51 నుంచి 75శాతం సాగు చేశారు. మొక్కజొన్న వంద శాతం సాగుచేశారు. జిల్లాల వారీగా పంటల సాగు విస్తీర్ణం శాతం వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, మెదక్, ములుగు, మేడ్చల్,వనపర్తి, సూర్యాపేట జిల్లాల్లో కేవలం 25శాతం విస్తీర్ణంలో మాత్రమే పంటలు సాగు చేశారు. మంచిర్యాల, కామారెడ్డి, సిద్ధిపేట, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ఖమ్మం, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో 26 నుంచి 50శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్ జిల్లాల్లో 51 నుంచి 75 విస్తీర్ణంలో పంటల సాగు జరిగింది.కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో 75శాతం నుంచి 100శాతం విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు. గత ఏడాది వానకాలంతో పోల్చితే ఈ ఏడాది కూడా రైతులు ఆశాభావంతో ఉన్నారు. అయితే అక్కడక్కడ వరి నారు ముదిరిపోతుండగా, వర్షాలు కురిసి నీరు అందుబాటులోకి వస్తే వట్టినారుతోనైనా పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. నీటి వనరులు అందుబాటులో లేకపోవడం, సకాలంలో వర్షాలు లేనందున కొన్ని ప్రాంతాల్లో రైతులు జొన్న, మొక్కజొన్న తదితర మెట్టపంటలవైపు మొగ్గు చూపుతున్నారు.

# జలవివాదంపై కేంద్రం చొరవ

న్యూఢిల్లీ,ఇరు తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదంపై చర్చకు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి కేంద్రం ఏర్పాట్లు చేసింది. ఈ నెల 16న దిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కావాలని కేంద్రం కోరింది. ఈ మేరకు వీరిద్దరిని ఆహ్వానిస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖ సర్క్యులర్ విడుదల చేసింది. ఈ భేటీకి హాజరయ్యేందుకు ఇద్దరు సీఎంలకు వీలవుతుందో లేదో తెలపాలని పేర్కొంది. మరోవైపు కృష్ణా, గోదావరి వాటాల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై రాష్ట్రంలోని ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులు, ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని సీఎం కోరనున్నారు. చంద్రబాబు బనకచర్ల ప్రతిపాదనలతో గోదావరి జలాలపై రచ్చ సాగుతోంది. ఈ క్రమంలో కేంద్రం ఈ భేటీ ఏర్పాటుచేయడం గమనార్హం. అయితే రేవంత్ ఢిల్లీ వెళతారా లేదా అన్నది ఇంకా తెలియాల్సి ఉంది. ఇకపోతే ఏపీ సీఎం చంద్రబాబు మంగళవారం దిల్లీ వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆయన అక్కడికి చేరుకోనున్నారు. కేంద్రమంత్రులు అమిత్‌షా, అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్‌తో సమావేశం కానున్నారు. ఈనెల 17న రాత్రి 9 గంటలకు తిరిగి విజయవాడకు చంద్రబాబు చేరుకోనున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రెండు రోజులు ఢిల్లీలో పర్యటించనున్నారు. మంగళ, బుధవారాల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులతో సీఎం చంద్రబాబు భేటీ- కానున్నారు. రాష్ట్ర ప్రాజెక్టులు, నిధులపై కేంద్ర మంత్రులతో సీఎం చర్చించనున్నారు. మాజీ ప్రధాని పీవీ సంస్మరణ సభ, సీఐఐ బిజినెస్ మీట్‌లో చంద్రబాబు పాల్గొననున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, మంత్రులు అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్, మన్సుఖ్ మాండవీయ, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ తదితరులతో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భేటీ కానున్నారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులు, వాటికి అవసరమైన నిధులు, పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సహా వేర్వేరు అంశాలపై సీఎం కేంద్ర మంత్రులతో చర్చించ నున్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన పనుల గురించి కూడా ఆయా మంత్రిత్వ శాఖతో సీఎం చర్చలు చేయనున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం 4.30కు ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం లైబ్రరీలో జరుగనున్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సంస్మరణ కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించనున్నారు. బుధవారం కేంద్ర కార్మిక ఉపాధి కల్పనా మంత్రి మన్సుఖ్ మాండవీయతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం కానున్నారు. నార్త్ బ్లాక్‌లో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ- కానున్నారు. ఎల్లుండి సాయంత్రం భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహించే బిజినెస్ కాన్ఫరెన్స్‌కు ముఖ్యమంత్రి హాజరు కానున్నారు. ఇదిలావుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 8 మంది మంత్రులు, అధికారుల బృందం ఈ నెల 26న సింగపూర్ పర్యటనకు వెళ్లనుంది. ఈనెల 30వ తేదీ వరకు ఈ బృందం సింగపూర్ లో పర్యటించనుంది.మంత్రులు లోకేశ్,నారాయణ,టీ-బీ భరత్, ఐఏఎస్ అధికారులు కాటంనేని భాస్కర్, ఎన్.యువరాజ్,కార్తికేయ మిశ్రా,కె.కన్నబాబు,సాయికాంత్ వర్మ ఈ బృందంలో ఉంటారు.పర్యటన ప్రధాన అజెండా రాజధాని నిర్మాణానికి సంబంధించిన అంశాలను అధ్యయనం చేయడమేనని సమాచారం. సింగపూర్ నగర ప్రణాళిక, నగర సుందరీకరణ,ఉద్యానవనాలు,ఓడరేవులు,మౌలిక వసతుల కల్పన, భవిష్యత్తు సాంకేతికతను అందిపుచ్చుకోవడం వంటి విషయాలను బృందం అధ్యయనం చేయనుంది.

# కమలం వాడిపోదా..!

న్యూఢిల్లీ,ఒకవైపు మోడీకి ప్రత్యామ్నాయ నేతను ఆర్ఎస్ఎస్ వెదికే పనిలో ఉందనే వార్తలు వస్తూ ఉన్నాయ. మరోవైపు ఇదే పరిణామాల మధ్యన ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఇచ్చిన స్టేట్ మెంట్ పై వార్తలను సమర్థించేలా ఉంది. రాజకీయ నాయకులు 75 యేళ్ల వయసుకు రిటైర్మెంట్ తీసుకోవాలంటూ మోహన్ భగవత్ వ్యాఖ్యానించారు! స్వయంగా ఆర్ఎస్ఎస్ చీఫ్ ఈ ప్రకటన చేశారు. దీంతో.. ఇది మోడీకి ఆర్ఎస్ఎస్ నుంచి అందుతున్న బహిరంగ సూచన అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతూ ఉన్నాయి.ప్రత్యేకించి ఈ డెబ్బై ఐదేళ్ల రిటైర్మెంట్ లేదా తప్పుకోవడం అనేది గత కొన్నాళ్లుగా బీజేపీలో అమల్లో ఉన్న అనధికారిక నియమం లాంటిదే! ఇదే కారణాన్ని చూపి మోడీ తొలి కేబినెట్లో కొంతమంది మంత్రులు చేత రాజీనామాలు కూడా చేయించారు! అప్పటికి దశాబ్దం ప్రతిపక్ష వాసం తర్వాత కేబినెట్లో చోటు సంపాదించిన వారిని కూడా 75 యేళ్లు దాటాయంటూ రిటైర్మెంట్ ఇప్పించారు. ఇంకా అనేక మంది సీనియర్లకు వివిధ రాజకీయ అవకాశాలను ఇవ్వడానికి అప్పుడు నిరాకరించారు! అదేమంటే.. వారి వయసు 75 సంవత్సరాలు లేదా అంతకన్నా ఎక్కువ అని, ఆ వయసు లో పెద్ద బాధ్యతలు అక్కర్లేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ వారిని పక్కన పెట్టారు! ప్రధానిగా మోడీ, బీజేపీ జాతీయాధ్యక్షుడిగా అమిత్ షా ఉన్నప్పుడు ఈ డెబ్బై ఐదేళ్ల వయసు నియమాన్ని చర్చలోకి తీసుకొచ్చారు. సీనియర్లను ఇంటికి పంపించడమో, రాజకీయ పునరావసం తరహా పదవులను ఇచ్చి పక్కన పెట్టడమో చేశారు!ఇదంతా దాదాపు పదేళ్ల కిందట జరిగిన సంగతి. మరి ఇప్పుడు మోడీ స్వయంగా 75కు దగ్గరపడుతున్నారు. మరో రెండు నెలల్లో ఆయన 75 యేళ్ల వయసును పూర్తి చేసుకుంటూ ఉన్నారు. అయితే మోడీకి ఈ నియమం వర్తించదంటూ బీజేపీ నేతలు గట్టిగానే చెప్పారు ఇప్పటికే! స్వయంగా అమిత్ షానే ఈ ప్రకటన చేశారు. మోడీకి 75 యేళ్ల వయసు రిటైర్మెంట్ వర్తించదని, ఈ టర్మ్ పూర్తయ్యే వరకూ మోడీనే ప్రధానిగా ఉంటారంటూ అమిత్ షా స్పష్టం చేశారు 2029 వరకూ మోడీనే ప్రధాని అంటూ కేంద్ర హోంశాఖా అధ్యక్షుడు ప్రకటించారు ఇది వరకే! అయితే ఇప్పుడు మోహన్ భగవత్ వ్యాఖ్యల సందేశం ఏమిటనే చర్చ జరుగుతూ ఉంది. ఈ ప్రకటనను మోడీ వ్యతిరేకులు బాగానే వాడుకుంటూ ఉన్నారు.ప్రత్యేకించి కొందరు కాంగ్రెస్ నేతలు మోడీకి ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడి సందేశాన్ని చేరవేస్తున్నట్టుగా మాట్లాడుతున్నారు. గతంలో ఇదే నియమాన్ని మోడీ ప్రవచించి, ఇతరుల విషయంలో అమలు చేశారని, ఇప్పుడు మోడీ ఆ నియమాన్ని పాటించరా.. అంటూ కాంగ్రెస్ నేతలు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. దేన్నైనా ప్రవచించి, ఆ తర్వాత దాన్ని తనే పాటించకపోవడం అనేది మంచి పద్ధతి కాదంటూ వారు వ్యాఖ్యానిస్తూ ఉన్నారు. పరోక్షంగా, ప్రత్యక్షంగా మోడీని వారు దెప్పి పొడుస్తూ ఉన్నారు!అమిత్ షా ప్రకటనను బట్టి చూస్తే.. మోడీకి 75 యేళ్ల వయసు రిటైర్మెంట్ అనేది జరిగే పని కాదు. అలాంటి అవసరం లేదు. బీజేపీ సీనియర్లకు ఆ నియమం వర్తింపజేస్తే చేశారు కానీ, మోడీకి మాత్రం అలాంటి నియమాలు ఉండవు! అద్వానీ, మురళీ మనోహర్ జోషీ, యడియూరప్ప ఇతరాత్ర సీనియర్ నేతలకు వర్తించిన అలాంటి నియమం మోడీకి మాత్రం వర్తించదు. అలాంటివి మోడీకి చెల్లుబాటు కావు. అయితే ఇప్పుడు ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు ఎవరిని ఉద్దేశించి ఆ వ్యాఖ్య చేశారు అనేది ఆసక్తిదాయకమైన అంశం. మరి బీజేపీలో అమలైన నియమం, బీజేపీ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు చేసిన సూచన.. మోడీకి వర్తించదా అనేది చర్చనీయాంశమే!అయితే మోడీకి వయసు రీత్యా రిటైర్మెంట్ ఇస్తే.. అప్పుడు కమలం పువ్వు పరిస్థితి ఏమవుతుంది అనేది మరో చర్చ! గత దశాబ్దకాలంగా బీజేపీలో మోడీ పేరు మార్మోగాల్సిందే తప్ప మరో మాటే లేదు! మోడీనే ప్రధానమంత్రి, మోడీనే బీజేపీ పాలిత రాష్ట్రాలకు ముఖ్యమంత్రి అన్నట్టుగా రాజకీయం సాగింది.

# పేదలకు సన్నబియ్యం ఊసే ఎత్తలే

నల్గొండ,బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వ లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. పేదవాడికి సన్న బియ్యం ఇచ్చి.. గుక్కెడు ముద్ద పెట్టాలని ఆలోచన సైతం గత ప్రభుత్వంలోని పెద్దలు చేయలేదని మండిపడ్డారు. సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అలాగే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆయన.. రూ. 34. 20 కోట్ల విలువైన పనులు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.ఉమ్మడి నల్లగొండ జిల్లాతో కాంగ్రెస్ పార్టీకి విడదీయరాని బంధం ఉందని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి అన్నారు. రేషన్ కార్డు పేదవాడి ఆత్మగౌరవం గుర్తింపు అన్నారు. ఆకలి తీర్చే ఆయుధమని తెలిపారు. తెలంగాణలో కొత్తగా 3. 58 లక్షల రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నట్లు- వివరించారు. కొత్త రేషన్ కార్డుల ద్వారా 11.3 లక్షల మందికి లబ్ధి చేకూరతుందన్నారు. తెలంగాణలో మొత్తం 95. 56 లక్షల మంది రేషన్ కార్డులు అందుకున్నారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి విపులీకరించారు. నల్గొండ చరిత్రే.. తెలంగాణ చరిత్ర అని కొనియాడారు. జిల్లా అభివృద్ధి అంతా కాంగ్రెస్ హయాంలోనే జరిగిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో రేషన్ షాపులు తెరవలేదని.. బెల్ట్ షాపులు తెరిచారంటూ వ్యంగ్యంగా అన్నారు. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తుంటే.. ఓర్వ లేక తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయంటూ మండిపడ్డారు. రైతు పండించిన పంటను కొనుగోలు చేస్తున్నామని.. రైతుకు బోనస్ సైతం ఇస్తున్నామని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల వల్లే నేడు నల్గొండ జిల్లాకు నీళ్లు వస్తున్నాయని గుర్తు చేశారు. పోరాట యోధులను అందించిన గడ్డ నల్గొండ అని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పిన తమ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. అయితే తమ ప్రభుత్వం రైతు భరోసా ఎగ్గొట్టిందంటూ దుష్ప్రచారం చేశారని ప్రతిపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతులకు రైతు భరోసా నగదు అందించామన్నారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని తెలిపారు. 18 నెలల్లో మహాలక్ష్మీ పథకంలో భాగంగా ప్రవేశపెట్టి మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి రూ. 6, 500 కోట్లు ఖర్చు అయిందని వివరించారు. తమ ప్రభుత్వం కొలువు తీరి రెండేళ్లు పూర్తయ్యే సరికి 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం.. ఆయన హయాంలోనే కూలేశ్వరం అయ్యిందని ఎద్దేవా చేశారు. కూలేశ్వరం ప్రాజెక్టు దగ్గరే వారిని ఉరి తీసినా తప్పు లేదన్నారు. ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా? అంటూ బీఆర్ఎస్ నేతలకు ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మూడు అడుగులున్న స్థానిక నేత ఎగిరెగిరి పడుతున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లు అవకాశం ఇచ్చినా తుంగతుర్తికి నీళ్లు ఎందుకు తేలేదంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని సీఎం సూటిగా ప్రశ్నించారు. తుంగతుర్తికి నీరు తేవడమంటే.. గ్లాస్‌లో సోడా పోసినట్లు కాదంటూ బీఆర్ఎస్ నేతకు ఈ సందర్భంగా చురకలంటించారు. దొర ముందు చేతులు కట్టుకుని గ్లాస్‌లో సోడా పోయడమే నీకు తెలుసంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిపై మండిపడ్డారు. సొంత మండలానికి ఎమ్మార్వో, ఎంపీడీవో ఆఫీసులే కాదు.. పోలీస్ స్టేషన్ సైతం తెచ్చుకోలేని ఘనత బీఆర్ఎస్ నేతలదంటూ వ్యంగ్యం అన్నారు.నాడు గంజికి లేని మూడు అగుడుల నాయకుడు.. నేడు బెంజి కార్లలో తిరుగు తున్నారంటూ జగదీశ్వర్ రెడ్డిపై వ్యంగ్య బాణాన్ని సీఎం రేవంత్ రెడ్డి సంధించారు. పదేళ్లు అధికారంలో ఉన్నా పేదలకు రేషన్ కార్డు, సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన బీఆర్ఎస్ నేతలకు రాలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3.10 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేశామని.. రేషన్ దుకాణాల వద్ద జనాలు బారులు తీరుతున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ఇచ్చామని.. వ్యవసాయం దండగ కాదు.. పండగలా చేశామన్నారు. దేశం తలెత్తుకునేలా వరి ధాన్యం ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. రైతు రాజు అయినప్పుడే ఇందిరమ్మ ఆత్మశాంతిస్తుందని ఆసక్తిక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం సహాయక సంఘాలను పట్టించుకోలేదు. మేము అధికారంలోకి వచ్చిన తరువాత స్వయం సహాయక సంఘాలకు పెట్రోల్ బంకులు అప్పగించాం. ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ పవర్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. మూడు అగుడుల వ్యక్తి నన్ను అడ్డుకుంటానని అంటున్నాడు. గ్లాసులో సోడా పోసినంత ఈజీ కాదు.. గోదావరి నీళ్లు తేవడం. ఒక్కసారి అడ్డుకుని చూడు, మా దామన్న చూసుకుంటాడని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ తదతరులు పాల్గొన్నారు.

# ఏం జరుగుతోంది?

హైదరాబాద్,బీజేపీ అంటేనే క్రమశిక్షణ గల పార్టీ. అధికారం కోసం, పదవుల కోసం కాకుండా సిద్ధాంతం కోసం పనిచేసే కార్యకర్తలు ఉంటారు. కానీ, మోదీ ప్రధాని అయ్యాక దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఇందుకోసం బీజేపీ వివిధ పార్టీల్లోని కీలక నాయకులను చేర్చుకుంది. దీంతో పార్టీ సిద్ధాంతం పక్కకుపోయింది. దీంతో పాత కొత్తల కలయిక కొన్ని రాష్ట్రాల్లో పార్టీకి ఇబ్బందిగా మారుతోంది. తెలంగాణలో కూడా అదే పరిస్థితి నెలకొంది. ఇందుకు మొన్న రాజీసింగ్, ఈ రోజు లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలే నిదర్శనం. తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేస్తామని హామీ ఇచ్చింది. ప్రధా మోదీ స్వయంగా ప్రకటించారు. ఈ ప్రకటన రాజకీయ చర్చకు దారితీసింది. ఈ క్రమంలో తాజాగా బీజేపీ నేత కె.లక్ష్మణ్, ఇతర రాష్ట్రాల్లో బీసీలను ముఖ్యమంత్రులుగా నియమించిన చరిత్రను గుర్తు చేస్తూ, ఈ హామీని పునరుద్ఘాటించారు. అదే సమయంలో, ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా, దానిని జాతీయ నాయకత్వం ఆమోదించడం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

బీసీ ముఖ్యమంత్రి హామీ..

బీజేపీ తెలంగాణలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా నియమిస్తామని 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించింది. ఈ హామీని పునరుద్ఘాటిస్తూ, బీజేపీ నేత కె.లక్ష్మణ్, ఇతర రాష్ట్రాల్లో బీసీ నేతలను ముఖ్యమంత్రులుగా చేసిన చరిత్రను ఉదాహరణగా చూపారు. ఈ ప్రకటన తెలంగాణలో బీసీ ఓటర్లను ఆకర్షించే లక్ష్యంతో చేసిన రాజకీయ వ్యూహంగా కనిపిస్తుంది, ఎందుకంటే రాష్ట్రంలో బీసీలు జనాభాలో సగానికి పైగా ఉన్నారు. బీసీ ఓటర్లు రాజకీయంగా నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. బీజేపీ ఈ హామీ ద్వారా బీసీ సమాజాన్ని ఏకతాటిపైకి తెచ్చి, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో పోటీ పడేందుకు ప్రయత్నిస్తోంది. అయితే, ఈ హామీ నిజమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందా లేక ఎన్నికల వ్యూహంగా మాత్రమే పరిమితమవుతుందా అనేది చర్చనీయాంశం.

రాజాసింగ్ రాజీనామా ప్రభావం..

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను రాష్ట్ర బీజేపీ జాతీయ నాయకత్వానికి పంపింది, దానిని జాతీయ నాయకత్వం ఆమోదించింది. ఈ రాజీనామా బీజేపీలో అంతర్గత ఇబ్బందులను సూచిస్తుంది. రాజాసింగ్ రాజీనామా వెనుక బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించే ఉద్దేశం ఉందా లేక ఇతర రాజకీయ కారణాలు ఉన్నాయా అనేది స్పష్టంగా తెలియలేదు.

# కృత్రిమ మేధతో భవితకు ధీమా

హైదరాబాద్,కృత్రిమ మేధ అనేది యంత్రాలు మానవులవలే ఆలోచించి, మానవ సామర్థ్యాలను అనుకరించే పనులను చేయగల సాంకేతికత. ఈ సాంకేతికత భారీ డేటాను సేకరించి, గణిత నమూనాలు లేదా అల్గారిథమ్‌ల ద్వారా నమూనాలను గుర్తించి, ఊహలు చేసేందుకు శిక్షణ పొందుతుంది. శిక్షణ తర్వాత, ఈ అల్గారిథమ్‌లు వివిధ అనువర్తనాల్లో ఉపయోగించబడతాయి. కొత్త డేటా నుండి నేర్చుకుంటూ, చిత్రాన్ని గుర్తించటం, భాషా ప్రాసెసింగ్, డేటా విశ్లేషణ వంటి సంక్లిష్ట పనులను మరింత ఖచ్చితత్వంతో నిర్వహిస్తాయి. ఎఐలో ప్రధాన రకాలు ఉన్నాయి. మెషిన్ లెర్నింగ్ డేటా నుండి నేర్చుకుని నిర్దిష్ట పనులను చేస్తుంది. దాని ఖచ్చితత్వం అనుభవంతోపాటు పెరుగుతుంది. డీప్‌లెర్నింగ్ మానవ మెదడును పోలి ఉంటుంది.అది న్యూరల్ నెట్‌వర్క్‌ల ద్వారా సంక్లిష్ట నమూనాలను గుర్తిస్తుంది. వైద్య చిత్రాల విశ్లేషణ, ఉపగ్రహ చిత్రాల్లో కదలికలు, ప్రకంపనలను గుర్తించడం వంటి పనులకు ఉపయోగపడుతుంది. న్యాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (ఎన్ఎల్‌పి) మానవ భాషను అర్థం చేసుకుని, సంభాషించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. జనరేటివ్ ఎఐ టెక్ట్స్, చిత్రాలు, వీడియోల వంటి కొత్త కంటెంట్‌ను సృష్టిస్తుంది. కళ, వినోదం, మార్కెటింగ్, సాఫ్ట్‌వేర్ మొదలైన అనేక రంగాల్లో, వాటి అభివృద్ధిలో అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. ఎఐ ఏజెంట్లు స్వయంచాలకంగా నిర్ణయాలు తీసుకుంటాయి. ఏజెంటిక్ ఎఐ బహుళ ఏజెంట్ల సమన్వయంతో సంక్లిష్ట పనులను నిర్వహిస్తుంది. ఉదాహరణకు, పరిశోధన లేదా సాఫ్ట్‌వేర్ సమస్యల వంటివి పరిష్కరిస్తుంది. ఎఐ నాలుగు వర్గాలుగా విభజించబడింది: రియాక్టివ్ ఎఐ సమాచారం ఆధారంగా ఫలితాలను ఉత్పత్తి చేస్తుంది. లిమిటెడ్ మెమరీ ఎఐ గత డేటాను ఉపయోగించి ఊహలు చేస్తుంది .థియరీ ఆఫ్ మైండ్ ఎఐ మానవ భావోద్వేగాలను అర్థం చేసుకునే సైద్ధాంతిక సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. సెల్ఫ్- అవేర్ ఎఐ యంత్రాలకు మానవ స్థాయి స్పృహను ఇవ్వగల సైద్ధాంతిక దశను కలిగి ఉంటుంది. ప్రస్తుతం, ఎఐ సమస్యలను పరిష్కరించడం, పరిష్కారాలను అభివృద్ధి చేయడం, ప్రశ్నలకు సమాధానమివ్వడం, సూచనలను అందించడం వంటివి చేస్తోంది. 'డ్రాప్‌బాక్స్', 'చాట్‌జిపిటి', 'సౌండ్‌రా' వంటి సాధనాలు మన సమయాన్ని ఎంతగానో ఆదా చేస్తాయి. ఉత్పాదకతను పెంచుతాయి. స్మార్ట్ ఫోన్ అసిస్టెంట్లు, ఇ-కామర్స్ సిఫారసు వ్యవస్థలు, స్వయంచాలక వాహనాలు, మోసం గుర్తింపు, ఆరోగ్య సంరక్షణ, వాతావరణ పరిశోధనలో ఎఐ ఉపయోగించబడుతోంది. ఎఐ కొత్త విద్యుత్ అని ఆండ్రూ ఎన్జీ పేర్కొన్నారు. గూగుల్ మ్యాప్స్, టెక్ట్స్ ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్ వంటి రోజువారీ సాధనాల్లో ఎఐ ఇప్పటికే ఉంది.ఎఐ నైపుణ్యాల డిమాండ్ గత దశాబ్దంలో నాలుగు రెట్లు పెరిగింది. ప్రస్తుతం ఎఐ సంబంధిత ఉద్యోగులకు 11 శాతం ఎక్కువ వేతనం లభిస్తున్నాయి. సమాచారం, ఆర్థిక శాఖ, పరిపాలన రంగాలలో ప్రత్యేకంగా ఎఐని ఉపయోగిస్తున్నారు. అనేక ఇతర రంగాలలో ఎఐ వాడకం నానాటికీ అనూహ్యంగా పెరుగుతోంది. ఎఐ డేటా ఎంట్రీ వంటి పునరావృత (రొటీన్) పనులను ఆటోమేట్‌గా వేగంగా పని చేస్తుంది. భారీ డేటాను సైతం విశ్లేషించి, తార్కిక నిర్ణయాలకు సహాయపడుతుంది. చాట్ బాట్‌లు కస్టమర్ డిమాండ్ మేరకు స్ట్రీమ్‌లైన్ చేస్తాయి. జెపి మోర్గాన్ ఒమ్ని ఎఐ ప్లాట్‌ఫారమ్ ఆర్థిక అంతర్ దృష్టులను అందించి, ఖర్చులను తగ్గిస్తుంది. 2028 నాటికి 90 శాతం యజమానులు ఎఐని అమలు చేయాలని ప్లాన్ చేస్తున్నారు.ఎఐ ఆటోమేషన్ 25 శాతం ఉద్యోగాలను భర్తీ చేయవచ్చు. కానీ సైబర్ సెక్యూరిటీ, డేటా విశ్లేషణ వంటి కొత్త రంగాల్లో అవకాశాలను మరింత ఎక్కువగా సృష్టించే అవకాశం ఉంది. ఆర్థికం, ఇ- కామర్స్, ఆరోగ్య




సంరక్షణ, విద్య, బీమా, న్యాయ సేవలు ఇలా అనేక రంగాల్లో ఎఐ వాడకం విస్తరించుకుంటూపోతుంది. గ్రంథాలయలలో ఎఐ వాడకం ఇంకా ప్రారంభ దశలో ఉన్నప్పటికీ, జ్ఞాన ప్రాప్యతను విస్తరిస్తుంది. చాట్‌బాట్‌లు కస్టమర్ ను గుర్తించటం, నిర్ధారణ చేసుకోవటం, డేటా పర్యవేక్షణ, ఖర్చు ఆదాలో సహాయపడుతునతున్నాయి. కానీ ప్రస్తుతం అసమర్థమైన స్పందనల కారణంగా మానవ లైబ్రరీయన్‌లను పూర్తిగా రీప్లేస్ చేయలేవు. మనిషికి బహు విధాలుగా ఉపయోగపడే సాధనంగా చెప్పచ్చు.ఎఐ సర్క్యులేషన్, కాటలాగింగ్ వంటి పనులను ఆటోమేట్‌గా చేస్తుంది, 'టెక్ట్ టు -స్పీచ్' ద్వారా సౌలభ్యతను మెరుగుపరుస్తుంది, డేటా విశ్లేషణ, విషయ సేకరణ, విషయ నిర్వహణ, మెటా డేటా ఖచ్చితత్వాన్ని పెంచుతుంది. లైబ్రరీయన్‌లు ఎఐని గురించిన అవగాహను పెంచుకోవాలి. దానికి సంబంధించిన జ్ఞానాన్ని లోతుగా పొందాలి. అందుకు వర్క్‌షాప్‌లు, శిక్షణా తరగతులు ఎక్కువగా నిర్వహించాలి. ఎఐ పై ప్రపంచ వ్యాప్తంగా అనేక విధాలుగా పరిశోధనలు జరుగుతున్నాయి. వాటిలో అప్ డేట్ వర్షన్లు గురించి లైబ్రేరియన్స్ ఎప్పటికపుడు తెలుసుకుంటూ ఉండాలి. ఎఐని బాధ్యతాయుతగా ఉపయోగించాలి.గమనించాల్సిన విషయాలు: ఎఐ ఎల్లప్పుడూ ఖచ్చితమైనది కాదు. ఎఐ పై మానవ తనిఖీ, పర్యవేక్షణ అవసరం. న్యాయ శాస్త్రంలో, పరిశోధనా రంగాలలో దీనిని జాగ్రత్తగా ఉపయోగించాలి. ఎందుకంటే ఇది కొన్ని తప్పుడు సమాచారాన్ని ఉత్పత్తి చేయవచ్చు. దీనికి వేగంగా సమాచారాన్ని తీసుకుని విశేషణ చేస్తుంది. అయితే అది విషయాన్ని నేర్చుకునే సమయంలో తప్పు సమాచారం ఇస్తే దానినే యథాతథంగా నేర్చుకొని తప్పు సమాధానమే మనకు ఇస్తుంది. రఫ్ డ్రాఫ్టలు, రాయడంలో లోపాల తగ్గిస్తుంది. పదేపదే చేయవలసిన రొటీన్ పునరావృత పనులకు ఎఐ ఉపయోగపడుతుంది. కానీ, అది ప్రస్తుత పరిస్థితుల్లో భావోద్వేగాలను వ్యక్తీకరించలేదు. భవిష్యత్తులో చెప్పలేం.అందుకే దీనికి మానవ స్పర్శ అవసరం. ఎఐ సాక్షరత పాఠశాల పాఠ్యాంశాల్లో భాగం కావాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఇది భవిష్యత్తు కెరీర్‌లకు ఉపయోగపడుతుంది. సామాజిక అభివృద్ధికి అది కీలకం కానుంది. ఎఐని గురించి ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. దీనిని సమర్థవంతంగా ఉపయోగించడానికి నిరంతర శిక్షణ, వృత్తిపరమైన అభివృద్ధి అవసరం ఉంటుంది. లైబ్రరీలు, విద్యా సంస్థలు ఎఐని సమీకరించడం ద్వారా డిజిటల్ సామర్థ్యాన్ని,ఆవిష్కరణలను పెంపొందించగలవు. ఎఐ మన జీవితాలను, పని వాతావరణాన్ని, విద్యను వేగంగా మార్చివేస్తోంది. అలాగే దీనిని బాధ్యతాయుతంగా ఉపయోగించడం ద్వారా మనం భవిష్యత్తును మరింత సమర్థవంతంగా, సమగ్రంగా రూపొందించగలం.

# తెలంగాణ స్థితికి ప్రతీక కాకతీయ పత్రిక

హైదరాబాద్,భారత స్వాతంత్ర్య పోరాటం సాగుతున్న రోజుల్లో తెలంగాణలో పత్రికలు నిర్వహించిన పాత్ర అనుపమానమైనది. 'అక్షరరూపం దాల్చిన ఒక సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక' అన్న కాళోజీ మాట పత్రికలు, ప్రజాస్వామ్య మనుగడకు ఆధారమవుతున్నది. తొలి తరంలో బ్రిటిష్ ప్రభుత్వం, ఆ తర్వాత నిజాం సర్కార్ల వల్ల పత్రిక నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొవాల్సి వచ్చింది.స్వేచ్ఛ, స్వాభిమానాలను కోల్పోకుండా కత్తి మీద సాములా పత్రికా నిర్వహణ చేస్తూ ఒకవైపు దేశ స్వాతంత్ర్యం కోసం, మరోవైపు నిజాం పాలనను అంతమొందించడంలో పత్రికలు కీలకభూమిక పోషించాయి. అదేవిధంగా సామాజిక జీవనంలో విలువలను ప్రతిష్టించడంలోనూ, సమాజ గమనాన్ని నిర్దేశించడంలోనూ కృషి చేసిన పత్రికా ప్రముఖులెందరో ఉన్నారు. ఈ క్రమంలో తెలంగాణలోని పత్రికలు, పాత్రికేయుల అవిరళ కృషి చిరస్మరణీయమైనది.తెలంగాణ చరిత్ర, సాహిత్య, సాంస్కృతిక వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయడంలో వరంగల్ ప్రధాన పాత్ర నిర్వహించింది. కాకతీయుల పౌరుష ప్రాభవాలకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన రాజధాని నగరమిది. వరంగల్ జిల్లా పత్రికారంగ చరిత్ర సింగిడిని తలపిస్తుంది. అన్ని తత్త్వాలను, అన్ని ఇజాలను, ఎన్నో నిజాలను తనదైన శైలిలో ప్రజలకు అందించి, చైతన్యాన్ని రగిలించిన ఘనత వరంగల్ జిల్లా పత్రికారంగానిది. వరంగల్ జిల్లా పత్రికారంగానికి ప్రథములు 'తెనుగు' పత్రికను వెలువరించిన ఒద్దిరాజు సోదరులు. వీరిని ఆదర్శంగా తీసుకొని వరంగల్ జిల్లాలో దాదాపు 175 పత్రికలు వెలువడటం గర్వకారణం. అలాంటి పత్రికల్లో 'కాకతీయ' వార పత్రిక చేసిన కృషి అజరామరమైనది.పాములపర్తి సదాశివరావు, పీవీ నరసింహారావుల ఆధ్వర్యంలో 1948, సర్వధారి నామ సంవత్సరం దీపావళి రోజున జాతీయ వార పత్రికగా 'కాకతీయ' వెలువడింది. ఈ పత్రికకు సదాశివరావు సంపాదకులుగా వ్యవహరించగా, వరంగల్‌లోని కాకతీయ ప్రెస్‌లో ముద్రించేవారు. ఇది రాజకీయ నేపథ్యంతో వెలువడిన పత్రిక. 1949, జూలై 17 నాటి సంచిక ముఖచిత్రంపై 'ప్రేమించండి ఒకరికొకరు సాయపడండి' అనే సూక్తి కనిపిస్తుంది. బహుశా ఇది వీరి ధ్యేయ వాక్యమై ఉండవచ్చు.పత్రిక వెల 20 పైసలు. ఈ పత్రికలో రాజకీయ, చారిత్రక, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య అంశాలతో పాటు వ్యంగ్యాత్మకమైన కార్టూన్లు కూడా కనిపిస్తాయి. అక్కడక్కడ ప్రకటనలు ప్రకటితమయ్యేవి. ప్రజా సమస్యలకు అద్దం పడుతూ పత్రికారంగ చరిత్రలో ఒక గొప్ప రాజకీయ వారపత్రికగా నిలిచిపోయింది 'కాకతీయ'. 1949 నాటిది అయినప్పటికీ, నేటి ప్రముఖ పత్రికలకు దీటైన రీతిలో నాడే వెలువరించడం నిర్వాహకుల కృషికి తార్కాణం. ఇది 1955 వరకు వెలువడింది. చలసాని ప్రసాదరావు, పి.ఎన్.స్వామి, జగదీశ్వర్‌రావు, పెండెం శ్రీనివాసరావు ఇందులో పనిచేశారు.1949, అక్టోబర్ 21 నాటి సంచికలో 'మనవి- నివేదన' శీర్షికన వెలువడిన సంపాదకీయంలో ఈ పత్రిక ఉద్దేశం, లక్ష్యం సుస్పష్టమయ్యాయి. 'అక్షరాస్యతకు మొహం వాచి దారిద్ర్య, అజ్ఞానాలతో అలమటించి కుమిలి కుమిలి తుదకు అశేష త్యాగాలతో దాస్యశృంఖలాలను పటాపంచలు చేసి ప్రజాతంత్ర చైతన్యంతో ఇప్పుడిప్పుడే ప్రజ్వలిస్తున్న తెలంగాణ, ఈ నూతన స్వాతంత్ర్య వాటిక హైదరాబాదు, ఒక్క సంవత్సరంగా అవిరామంగా కృషి చేస్తూ, ఇంకా స్వరాజ్యాన్ని చేపట్టలేక వినూతనాశారేఖలతో భవిష్యత్తును చిత్రితం చేసుకుంటున్న మా అభిమాన సోదర



పౌరకోటి. ఈ పరిసరాల్లో మేము కాకతీయ పత్రిక ద్వారా హృదయ పూర్వకంగా చేస్తున్న కించిత్సేవ వల్ల లేశమైన ప్రజాప్రయోజ నం సాధన అవ్వగలిగిందంటే మా ఉద్యమం ఫలించినట్లు భావించి మేమెంతో ఆనందిస్తాము'. ఈ విధంగా కాకతీయ పత్రిక తన ఉద్దేశాన్ని, లక్ష్యాన్ని నిర్భయంగా, నిజాయితీతో ప్రకటించిన తీరు ఆ పత్రి క పురోగమనానికి మరింత దోహదపడినట్లు తెలుస్తున్నది.ఈ సంపాదకీయం నాటి తెలంగాణ సామాజిక స్థితిని గోచరింపజేస్తుంది. ఈ పత్రిక నడిచినంత కాలం సమకాలీన సమాజానికి సమాచార సేవ చేసింది. చైతన్యపూరితమైన ఆలోచనలను ప్రేరేపించింది. ఎంతో మంది జర్నలిస్టులను తయారు చేసింది. నిజాం వ్యతిరేకోద్యమ సందర్భంలో పోలీసు చర్య తర్వాత మిలిటరీ అధికారి సంజప్ప ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలోని పాకాలలో 24 మంది గిరిజనులను కాల్చి వారిని మిలిటరీ ట్రక్కుకు కట్టి ఊరేగించారు. ఆ వార్తను కాకతీయ విలేకరి పి.ఎన్.స్వామి పత్రికకు పంపించగా, అది ప్రచురితమై నిజాం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది.ఆ వార్తను ప్రచురించినందుకు 1948లో పాములపర్తివారికి అప్పటి కలెక్టర్ పళనియప్పన్ నుంచి కబురు అందింది. సమయ పాలనకు ప్రాధాన్యాన్ని ఇచ్చే సదాశివరావు నిర్భయంగా టాంగాలో వెళ్లి 15 నిమిషాలు వేచి చూసినా కలెక్టర్ కార్యాలయానికి రాకపోవడంతో వెనక్కితిరిగి వచ్చేశారు. ఇది వారి ఆత్మ గౌరవానికి ప్రతీక. ఈ విషయం తెలిసిన పళనియప్పన్.. డిప్యూటీ కలెక్టర్‌ను (దువ్వం తాలూకుదారు) పంపించి సదాశివరావును మళ్లీ పిలిపించారు. ఆ వార్తను ఖండించారు.మార్క్సిస్టు మేధావి అయిన సదాశివరావు మొదట ముద్రించిన వార్తతోపాటు ఖండనను కలిపి మరోమారు ముద్రించారు. ఈ విధంగా కాకతీయ పత్రిక నిజాల్ని నిర్భయంగా జన సామాన్యానికి చేరవేయడంలో నిర్వహించిన పాత్ర పత్రికారంగానికి మార్గదర్శకమైనది. కాకతీయ పత్రిక వార్తలను ప్రచురించడంలో నిజాయితీ, నిర్భీతి, ముక్కుసూటిదనం, వాస్తవిక ధోరణులను ప్రతిబింబించినట్టు తెలుస్తున్నది. పత్రికను వెలువరించడమే కష్టతరమైన కాలంలో స్వాతంత్ర్య ఉద్యమ ఘట్టాలను, నిజాం పాలకుల అకృత్యాలను, సమకాలీన సామాజిక రాజకీయ రంగంలోని విశేషాలనే కాకుండా, వివిధ వార్తాంశాలను వ్యంగ్యాత్మక కార్టూన్ల సహితంగా చక్కని సమీక్షలు, విశ్లేషణలతో ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసే విధంగా రాజకీయ వ్యాఖ్యలను అందించడం ఈ పత్రిక ప్రత్యేకత. కార్టూనిస్టు మల్లారెడ్డి వేసిన చిత్రాలు ఈ పత్రికకు మరింత వన్నె తెచ్చాయి.1949, ఆగస్టు 15 నాటి సంచికలో 'విజయ' కలం పేరుతో పీవీ రాసిన 'గొల్లరామవ్వ' కథ ప్రచురితమైంది. నాటి తెలంగాణ ప్రాంత గ్రామీణ స్థితికి ప్రతిరూపంగా వెలువడిన కథ ఇది.

# విభేదాలను వివాదాలుగా మార్చకూడదు

బీజింగ్,దూరదృష్టితో ఆలోచించి ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని భారత విదేశాంగశాఖ మంత్రి జై శంకర్ చైనాకు సూచించారు. విభేదాలు ఎప్పుడూ వివాదాలుగా మారకూడదని, అలాగే పోటీ-.. సంఘర్షణగా మారకూడదని జై శంకర్ అన్నారు. చైనా పర్యటనలో ఉన్న ఆయన.. ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి వాంగ్ యీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టియాంజిన్ వేదికగా మంగళవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకోవాలని, మంచి ఫలితాలు రావాలని కోరుకున్నట్లు చెప్పారు. ఇరుదేశాల విదేశాంగశాఖ మంత్రుల సమావేశంలో జైశంకర్ మాట్లాడుతూ.. భారత్, చైనా మధ్య స్థిరమైన సంబంధాలు ప్రపంచానికే మేలు చేస్తాయని తెలిపారు. మంగళవారం జరగనున్న ఎస్‌సీవో సమావేశంలో ముఖ్యంగా తీవ్రవాదం, వేర్పాటువాదం, ఉగ్రవాదం అనే అంశాలపై చర్చించాల్సిన అవసరం ఉందని జైశంకర్ పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని అణిచివేయాలన్న కృతనిశ్చయంతో భారత్ ఉందని పునరుద్ఘాటించారు. విదేశాంగశాఖ మంత్రిగా ఇరుదేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత వాంగ్ యీ పైనా ఉందని జైశంకర్ తెలిపారు. నిర్మాణాత్మకమైన, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎస్‌సీవోలో చర్చలు సాగుతాయని ఆశిస్తున్నట్టు చెప్పారు. అక్టోబర్ 2024లో ఇరుదేశాల నేతల సమావేశం జరిగిన తర్వాత నుంచి ఇరుదేశాల మధ్య సంబంధాలు సానుకూల దిశలో ముందుకు సాగుతున్నాయి. బాధ్యతాయుతంగా మన రెండు దేశాలు దానిని కొనసాగించాలి. ఇటీ-వల కాలంలో పలు అంతర్జాతీయ వేదికల్లో కలిసేందుకు, వ్యూహాత్మక చర్చలు జరిపేందుకు అవకాశం లభించింది. ఇలా క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు- చేసుకొని పరస్పరం చర్చించుకుంటే రెండు దేశాలకూ మేలు జరుగుతుందని భారత్ ఆశిస్తోంది. భారత్, చైనా మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి ఈ ఏడాదితో 75 ఏళ్లు పూర్తవుతుంది. ఐదేళ్ల విరామం తర్వాత ప్రఖ్యాత మానసరోవర్ యాత్ర పునఃప్రారంభమైనందుకు సంతోషంగా ఉంది. ఈ విషయంలో చైనాకు కృతజ్ఞతలు చెబుతున్నాని అన్నారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ద్వైపాక్షిక సంబంధాల విషయంలో గత 9 నెలల్లో కీలక పురోగతి సాధించాం. సరిహద్దు వెంబడి ఘర్షణ వాతావరణం లేకుండా చర్యలు తీసుకున్నాం. ద్వైపాక్షిక సంబంధాలు సజావుగా సాగుతున్నాయనడానికి ఇదే నిదర్శనం. ఉద్రిక్తతలను తగ్గించడంతో సహా సరిహద్దుకు సంబంధించిన ఇతర అంశాలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. అర్థికంగా రెండు బలమైన దేశాలు కలిసి ముందుకు వెళ్తే.. త్వరితగతిన అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.

# ఇంత పబ్లిక్..

అమరావతి,జగన్ చుట్టూ ఇంత మంది జనం.. రియలా ఫేకా? అసలేంటీ పొలిటికల్ పబ్లిక్ స్టోరీ? అన్నదిప్పుడు చర్చనీయాంశం. బేసిగ్గా జగన్ కి బీసీ-ఎస్సీ-ఎస్టీ- ముస్లిం- క్రిష్టియన్- మైనార్టీల్లో ఓటు బ్యాంకు ఉన్న మాట నిజం. ఆ సాలిడ్ ఓటు బ్యాంకే మొన్నటి ఎన్నికల్లో 39 శాతం ఓట్లు పడేలా చేసింది. ఈ ఓటర్లు నిజానికైతే.. అంత ఫ్రీగా దొరికే వారు కాదు. ఎందుకంటే వీరు దైనందని జీవితాల్లో యమ బిజీగా ఉంటారు. కారణమేంటంటే వారు నిత్యం ఏదో ఒక పనీ పాట చేసుకోకుంటే పూట గడవదు. ఒక రకంగా చెబితే రెక్కాడితే గానీ డొక్కాడదు. అలాంటి జనం జగన్ రావడంతోటే ఇంతగా రోడ్డెక్కుతారా? ఒక సినిమా నటుడికి మల్లే ఇంతగా పిచ్చెక్కి ఆయనపై ఎగబడతారా? అన్నదొక సస్పెన్స్. అయితే ఇక్కడే కొందరికి ఒక డౌట్ వస్తోంది. కారణమేంటంటే.. ఇదంత ఒరిజినల్ ఫ్యాన్ బేస్ కాదన్నది ఒక అంచనా. కారణం మనం ఇందాకే మాట్లాడుకున్నాం. జగన్ కి ఉన్న ఓటు బ్యాంకు ఎలాంటిదో గుర్తు చేసుకున్నాం. వారంత తీరిగ్గా.. ఇలాంటి రాజకీయ దండయాత్ర లకు రారు.ఒక వేళ వస్తే.. ఇంట్లో పొయ్యిలో పిల్లి ఆ రోజంతా అలాగే నిద్ర పోయే పరిస్థితి.మరి వీరంతా ఎవరు? ఎక్కడి నుంచి వస్తున్నారు? వీరికేం పనీ పాటా లేదా? అంటే ఇక్కడ కూడా మనకొక ఉదాహరణ దొరుకుతుంది. తాజాగా పేర్ని నాని ఒక వీడియో లీక్ అయ్యింది. ఆయన జనాన్ని ఎలా పురమాయిస్తారో అన్న విషయం పిచ్చ క్లారిటీతో ఈ వీడియోలో మనకు కనిపిస్తుంది. అంతే కాదు గతంలో జగన్ అధికారంలో ఉండగా.. ఆయన ప్రోగ్రామ్స్ కి ఏ టూ జెడ్ సర్వీస్ అందించే వారున్నారు. ఈ బాధ్యతలన్నిటినీ తలశిల రఘురామ్ చూసుకునే వారని చెబుతారు. ఇక స్క్రిప్టింగ్ కి ఒక టీమ్ ఇలా.. జగన్ తన పొలిటికల్ జర్నీలో ఇలాంటి వంధిమాగధులను పుష్కలంగా నియమించుకున్నట్టు తెలుస్తోంది. వీరందరికీ అధినాయకత్వం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వహించగా.. ఆయన కుమారుడు ఎంపీ మిథున్ రెడ్డి పర్యవేక్షణ చేస్తుంటారట.జగన్ చుట్టూ ఇంత కోటరీ వర్క్ చేస్తూ ఉంటుంది. ఈ కోటరీ పనల్లా ఏంటంటే.. జగన్ ఎ క్కడికి వస్తే అక్కడికి జనాన్ని తోలడం. ఆయా ఏర్పాట్లు చేయడం. మొన్నటికి మొన్న బంగారు పాళ్యం మామిడి కాయల వ్యవహారం చూసే ఉంటాం. తన పల్నాడు పర్యటనలో ఏ విధంగా.. తలకాయను తన కారు టైర్ల కింద వేసి తొక్కించాడో సరిగ్గా అలాగే.. మామిడికాయలను కూడా రప్పా రప్పా వేసి తొక్కించిన దృశ్యాలను చూసే ఉంటాం.ఇవేవీ యాధృచ్చికంగా జరుగుతున్నవి కావంటారు. వీటన్నిటి వెనక అతి పెద్ద నెట్ వర్క్ పని చేస్తూ ఉంటుంది. జగన్ పని అయిపోయింది. ఈసారి ఆ పదకొండు సీట్లు కూడా రావు. ఇక ఆయన్ను భారీ ఎత్తున లీడర్లు కూడా వదిలేస్తున్నారు.. అన్న కామెంట్ వినిపించినపుడల్లా.. ఈ నెట్ వర్క్ అమాంతం ఉలిక్కి పడుతుంది. జగన్ ఇమేజీని పెద్ద ఎత్తున జాకీలేసి లేపడానికి.. వీరంతా కూడబలుక్కుంటారు. జూమ్ మీటటింగులు చేసుకుంటారు. కాన్ఫరెన్స్ కాల్స్ మాట్లాడుకుంటారు.. అంతే ఒక ప్రణాళిక సిద్ధం చేసి జగన్ కి అప్ డేట్ చేస్తారు.అన్నా అక్కడ మన గంజాయ్ బ్యాచ్ అరెస్టయ్యింది. వాళ్లంతా మనం సరఫరా చేసిన గంజాయ్ తీస్కునే ఇలా తయార య్యారు. అలాంటి వాళ్లు అరెస్టయితే ఓదార్చాల్సింది మనమే అని అలెర్ట్ చేస్తారు. ఎప్పుడో గత ఏడాది చనిపోయిన నాగమల్లేశ్వరరావు విగ్రహం పెట్టడానికి చందాలిచ్చాం. మీరొస్తే బాగుంటుంది.. అని గ్రౌండ్ ప్రిపేర్ చేస్తారు. అలా అలా ఈ నెట్ వర్క్ ఒక పద్ధతి ప్రకారం నడుస్తుంది. దీంతో ఇదిగో ఇలాంటి క్రౌడీ సీన్లు మీకు బుల్లి(టీవీ చానెళ్లు) అతి బుల్లి తెరలపై( మొబైల్ స్క్రీన్లు) దర్శనమివ్వడానికి రెడీ అయిపోతాయ్.ఒక రకంగా చెబితే.. వీరు ప్రతి జగన్ పర్యటననూ ఒక సినిమా షూటింగ్ స్థాయిలో ప్లాన్ చేస్తారంటే అతిశయోక్తి కాదు. కారణం అక్కడ హీరోల సినిమాలు గొప్పగా ఆడాలి కలెక్షన్ల వర్షం కురవాలన్నది టార్గెట్. అదే ఇక్కడ జగనన్న క్రేజ్ ఎంత మాత్రం తగ్గలేదు. ఆయన రోడ్డు మీదకొస్తే ఇసకేస్తే రాలనంత జనం వస్తున్నారన్న పబ్లిసిటీ పీక్ లో ఉండాలని ఫిక్స్ అవుతారు. తద్వారా తమ సాలిడ్ ఓటు బ్యాంకును మరింత యాక్టివ్ చేస్తుంటారు.ఎందుకంటే తమకు ఓటు వేసే వారికి.. జగన్ కి క్రేజ్ ఉందని తెలియడం కూడా ముఖ్యమే. కారణం.. ఏ వార్తల్లో లేని జగన్ కి వాళు మాత్రం ఎందుకు ఓటు వేయాలి?ఇదంతా ఒక ప్రీప్లాన్డ్ స్కెచ్. ఇందులో అవసరమైతే ఎందరు ప్రాణాలు పోయినా పర్లేదు. కానీ.. తామనుకున్న ప్రచారం మాత్రం ఒక రేంజ్ లో సాగాలన్నది.. వీరి ప్రధాన టార్గెట్ గా తెలుస్తోంది. పదే పదే ఒక మాట అంటూ ఉంటారు. మనకంటూ ప్రత్యేకించి ఛానెళు,ఇతర మీడియా నెట్ వర్క్ తో పని లేదు.. మీ చేతిలో ఫోన్ ఉంటే చాలు.. మన పని అదే సులువు అవుతుందని ఆయన అనేది ఇందుకే.

# బయటకు వచ్చేద్దాం.. కవిత అర్ధరాత్రి చర్చలు!



హైదరాబాద్,'బీఆర్ ఎస్ పార్టీలో ఉండాలా? వద్దా?'–ఇదే అజెండాతో సోమవారం అర్ధరాత్రి ఆ పార్టీ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత.. తనకు అత్యంత సన్నిహితంగా ఉండే.. కేసీఆర్ మనుషులతో ఓ హోటల్‌లో చర్చలు జరి పినట్టు తెలిసింది. ఈ భేటీపై అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. కవిత చాలా సీరియస్‌గా ఉన్నట్టు తెలిసింది. పార్టీలో తనకు ప్రాధాన్యం లేకుండా పోయిందని.. ముఖ్యంగా తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు చేసిన తర్వాత తనకు మద్దతుగా పార్టీ నుంచి ఒక్క ప్రకటన కూడా రాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ జాగృతికి చెందిన ఇద్దరు, కేసీఆర్‌కు మద్దతుగా ఉంటూ.. ఇరు శిబిరాల్లోనూ సానుకూలత దక్కించుకున్న ఓ నాయకుడితోనూ ఆమె అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు చర్చలు జరిపినట్టు తెలిసింది. సుదీర్ఘంగా మూడు గంటల పాటు.. జరిగిన ఈ చర్చల్లో కవిత భర్త అనిల్ సహా ఆమె కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారని సమాచారం. పార్టీలో ఉ ఒడడమా.. బయటకు రావడమా? అనే విషయంపైనే ఈ చర్చ సాగినట్టు తెలిసింది. ఇటీవల జరిగిన రెండు మూడు పరిణామాలను ఈ సందర్భంగా అనిల్ ప్రస్తావించి.. కేసీఆర్ నుంచి మద్ద తు కొరవడినా.. ప్రజల్లో సింపతీ పెరుగుతోందని.. కవిత వస్తే.. బాగానే స్పందన ఉంటోందని కూడా అనిల్ చెప్పినట్టు తెలిసింది. ముఖ్యంగా కవితకు ఓ వర్గం మీడియా అండగా ఉందని ఆయన చెబుతున్నారు. కేసీఆర్‌ను వ్యతిరేకించే వర్గాలు.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలోని వారు కూడా.. కవితవైపు ఉన్నట్టు తెలిపారని సమాచారం. ఈ క్రమంలో బయటకు వచ్చే విషయంపై ఇప్పుడే నిర్ణయం తీసుకుంటే బెటర్ అని కూడా అనిల్ చెప్పినట్టు తెలిసింది. తీన్మార్ మల్లన్నపై కవిత ఓ రకంగా పోరాటమే చేశారు. బయటకు వచ్చారు. మీడియా ముందు కూడా మాట్లాడారు. కంచం–మంచం అంటూ.. చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. అయితే.. పార్టీ నుంచి మాత్రం తనకు సంపూర్ణ మద్దతు లభించలేదని.. ఒక్కరంటే ఒక్కరు కూడా తనకు మద్దతుగా మాట్లాడలేదని ఆమె చెబుతున్నారు. ఇది కూడా వాస్తవమే. జగదీశ్వర్‌రెడ్డి విషయంలో స్పందించినట్టుగా.. కవిత విషయంలో ఎవరూ స్పందించలేదు. ఇక, తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్ కూడా మౌనంగా ఉన్నారు. ఈ క్రమంలో బయటకు వచ్చే అంశంపై సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిసింది. దీనిపై రేపో మాపో మరోసారి భేటీ అయి.. స్థానిక ఎన్నికలకు ముందే నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని సమాచారం.

# వివాదాల్లో జనసేన నేతలు.. ఇలా అయితే కష్టమే..!



హైదరాబాద్,జనసేన నాయకులు వరుస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. ఎప్పటికప్పుడు వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్న అంశాలు కూడా తెలిసిందే. నిజానికి జనసేన పార్టీ అంటే నిబద్ధతకు, ప్రజా సేవకు, ప్రశ్నించే తత్వానికి కీలకమని ఆ పార్టీ అధినేతగా పవన్ కళ్యాణ్ పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. తాను కూడా అదే విధానాన్ని అవలంబిస్తానని ఆయన అన్నారు. అయితే అనూహ్యంగా పార్టీలో జరుగుతున్న పరిణామాలు పార్టీని, పార్టీ అధినేతను కూడా ఇరుకున పడేస్తున్నాయి. అయితే ఎప్పటికప్పుడు ఉపేక్షించకుండా ఆయన చర్యలు అయితే తీసుకుంటున్నారు. కానీ, నాయకులలో మాత్రం మార్పు పెద్దగా కనిపించడం లేదు. గతంలో పార్టీకి బలమైన వాయిస్ గా ఉండి ఎన్నికల సమయంలో జనసేన తరపున ప్రచార గీతాలను కూడా ఆలపించినటువంటి జానీ మాస్టర్ తర్వాత కాలంలో లైంగిక వేధింపుల కేసులు ఎదుర్కొన్నారు. దీంతో అప్పటివరకు ఆయనను పార్టీ ప్రచారకర్తగా.. పార్టీ అధికార ప్రతినిధిగా నియమించిన.. పవన్ కళ్యాణ్ ఆయనను పార్టీ నుంచి తప్పించాల్సి వచ్చింది. ఆ తర్వాత ఆయన కేసులో బెయిల్ పొంది బయటకు వచ్చినా జనసేన పార్టీకి దూరంగానే ఉంటున్నారు. జనసేన కూడా ఆయనను పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇక తర్వాత పిఠాపురంలోనే ఓ బాలికపై జనసేన కార్యకర్త ఒకరు లైంగిక దాడికి పాల్పడడం, కేసులు పెట్టడం వంటివి జరిగాయి. దీంతో అప్పుడు కూడా సదర కార్యకర్తను పార్టీకి దూరంగా ఉంచారు. ఇక తాజాగా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్చార్జి వినుత వ్యవహారం మరింతగా పార్టీని ఇబ్బందుల్లో వేసింది. వినుత బలమైన గళం ఉన్న నాయకురాలు. స్థానికం గా కూడా మంచి పేరు సంపాదించుకుంది. కానీ, ఆమె వ్యక్తిగత వ్యవహారాలు వివాదాస్పదం కావడం, పార్టీ వ్యవ్యవహారాలకు సంబంధించి పనులు చేసి పెడతానని కొంతమంది సొంత పార్టీ కార్యకర్తల దగ్గర డబ్బులు వసూలు చేశారనేది వినుతి పై ఉన్న ప్రధాన ఆరోపణ. అదే సమయంలో ఇతర పార్టీ నాయకులతో కలిసి కాంట్రాక్టులు చేస్తున్నారనేది కూడా ఆమెపై ఉన్న ఆరోపణలు. ఈ క్రమంలోనే కొన్నాళ్ల కిందట ఆమెపై పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. అయినా తాజా పరిణామాల రీత్యా ఆమెను పార్టీ నుంచి బహిష్కరించారు. ఇవి పైకి కనిపిస్తున్న వ్యవహారాలు మాత్రమే కాదు. ఎమ్మెల్యేలు కూడా కొంతమంది గాడి తప్పుతున్నారు. కాబట్టి ఇలాంటి పరిణామాలను జనసేన అధినేత ఒకటికి రెండుసార్లు పరిశీలించి ఇలాంటి వారిపై తగిన విధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే వచ్చే నాలుగేళ్లలో పార్టీ పరిస్థితి ఇబ్బందుల్లో పడుతుందనేది పరిశీలకులు వేస్తున్న అంచనా. మరి ఏం చేస్తారనేది చూడాలి. ఇక్కడ చిత్రం ఏంటంటే పనిచేస్తామన్న నాయకుల కంటే కూడా వీరికి పార్టీలో ప్రాధాన్యం దక్కుతోందన్నది మరో ప్రధాన విమర్శ.

# వైసీపీలో మాజీ రెడ్డి మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు కోల్డ్ స్టోరేజ్!



అమరావతి,వైసీపీలో ఏమి జరుగుతోంది అన్నది ఇపుడు చర్చ గా ఉంది. ఆ పార్టీని పునాది స్థాయి నుంచి తమ సొంతం చేసుకుని భుజాల మీద మోసి పెంచి పెద్ద చేసిన ఒక బలమైన సామాజిక వర్గం ఇపుడు ఏమి చేస్తోంది అన్నది కూడా చర్చ గా ఉంది. ఆ సామాజిక వర్గం సైలెంట్ అవడం వెనక కారణాలు ఏమిటి అన్నది కూడా అంతా ఆలోచిస్తున్నారు. వైసీపీలో ఇపుడు చూస్తే ఒక విచిత్రమైన పరిస్థితి ఉందని అంతా అంటున్నారు. వైసీపీ అంటేనే రెడ్డి సామాజిక వర్గానికి ఒక పూనకం లాంటిది వస్తుందని అంటున్నారు. తమ పార్టీ తమ జెండా అని మురిసిపోవడం ద్వారా వారు అమితానందం పొందుతారు. అయితే వైసీపీలో ఇపుడు సీన్ మారుతోందా అన్నదే చర్చగా ఉంది. ఇపుడు వైసీపీలో కొత్తగా వచ్చిన వారు యూత్ కి చెందిన రెడ్లు అయితే మంచి ఊపు మీద కనిపిస్తున్నారు. వారే ఎంతో కొంత పార్టీకి మౌత్ వాయిస్ గా మారుతున్నారు. అదే సమయంలో పార్టీలో పునాదుల నుంచి ఉన్న వారు గట్టి వారు సబ్జెక్ట్ ఉన్న వారు, రాజకీయ అనుభవం దండీగా ఉన్నవారి సంగతి ఏమిటి అన్నది ఒక ప్రశ్నగా ఉంది. అయితే వారంతా పాత రెడ్లుగా ఒక కేటగిరీగా మారిపోయారా అన్నదే మరో పాయింట్. దాంతో కొత్త నీరు వచ్చాక పాత నీరు పక్కకు తప్పుకున్నట్లుగా వారంతా వెనుకబడి పోతున్నారు అని అంటున్నారు. ఒక విధంగా చెప్పాలీ అంటే వారు కోల్డ్ స్టోరేజిలో ఉన్నట్లుగానే వైసీపీలో సీన్ కనిపిస్తోంది అని అంటున్నారు. ఇక మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలుగా పనిచేసిన సీనియర్ రెడ్లు పార్టీ లో ఉన్నారా లేరా అన్నతగా తేడా కనిపిస్తోంది అని అంటున్నారు. వీరంతా దైనందిన రాజకీయాలను పెద్దగా పట్టించుకోవడం లేదని అంటున్నారు. వైసీపీలో ఒక బలమైన గొంతుకగా మాజీ మంత్రి పేర్ని నానిది మాత్రమే వినిపిస్తోంది. అంతే తప్ప మరో వాయిస్ కానీ మరో నాయకుడు కానీ వినిపించడం లేదు, కనిపించడం లేదు అని అంటున్నారు. ఇక వైసీపీ అధినేత జిల్లా పర్యటనలు బాగానే సక్సెస్ అవుతున్నాయి. జగన్ కి బాగానే జనాలు వస్తున్నారు. అయితే అది జిల్లా అంతటా పార్టీ జనాలను సమీకరించి పోగు చేస్తేనే వచ్చిన జనంగా విశ్లేషణలు ఉన్నాయి. అదే జగన్ ఒక నియోజకవర్గంలోనే పర్యటన చేస్తే అంత జన సమూహం రాకపోవచ్చు అని కూడా అంటున్నారు. వైసీపీ విషయానికి వస్తే పదిహేనేళ్ళ చరిత్ర కలిగిన పార్టీ. ఆ పార్టీకి పునాదిగా బలమైన రెడ్లు ఉన్నారు. రాయలసీమ నాలుగు జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలలోనూ రెడ్లు పవర్ ఫుల్ గా ఉన్నారు. అయినా సరే వారు వైసీపీ విషయంలో పెద్దగా నోరు చేసుకోవడం లేదు, కూటమి ప్రభుత్వం అధికారం ఏడాది దాటినా వారి పెదవులు కదలడం లేదు. మరి ఏ రాజకీయ మొహమాటాలు అడ్డు వస్తున్నాయో అన్న చర్చ కూడా ఉంది. అయితే వైసీపీ అధికారంలో ఉన్నపుడు సామాజిక న్యాయం సమీకరణలు అని చెప్పి చాలా మంది విషయంలో చేయాల్సింది కూడా ఏమీ చేయలేదు అని అంటున్నారు. ఆ అసంతృప్తి వారిలో ఇపుడు అలాగే ఉంది అని అంటునారు. ఇక వైసీపీ 2.0 అని అంటున్నా ఎవరూ పెద్దగా దానిని పట్టింపుగా తీసుకోవడం లేదని అంటున్నారు. ఒకసారి అయింది మళ్ళీ వస్తే ఏమవుతుంది, చూద్దాంలే అన్నట్లుగానే సీన్ ఉందిట. అంతే కాదు మరో నాలుగేళ్ళ పాటు కూటమి అధికారంలో ఉంటుంది. దాంతో ఎందుకొచ్చిన రాజకీయ రచ్చ ఎందుకొచ్చిన తంటాలు అని అనుకుంటూ చాలా మంది నిమ్మళంగా ఉంటున్నారుట. మరి కొందరు తెలివైన వారు తెలుగుదేశం నాయకులతో లోపాయికారీగా అవగాహనలు లాలూచీలు పడి తమ పనులు చల్లగా చేసుకుంటున్నారుట. ఎవరి వ్యాపకాలు వ్యాపారాలలో వారు ఉన్నారు తప్పించి వైసీపీ మా పార్టీ అని గుడ్డలు చించుకుని రోడ్ల మీదకు రావడం లేదని అంటున్నారు. అంతే కాదు గొంతు చించుకోవాల్సిన అవసరం కూడా ప్రస్తుతానికి లేదని అంటున్నారు. వైసీపీకి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు ఇలా చాలా మంది స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నా ఎవరూ కూడా పార్టీ పట్ల మునుపటి మాదిరిగా విరగదీసిన తీరులో అభిమానం అయితే చూపించడం లేదని అంటున్నారు. దీనికి కారణాలు ఏమిటి అంటే అధినాయకత్వం ఆత్మ విమర్శ చేసుకోవాలని అంటున్నారు. పవర్ లో ఉన్నపుడు చేసిన తప్పులు పొరపాట్లు ఇపుడు రివర్స్ లో వచ్చి కొడుతున్నాయా అన్నది కూడా చర్చగా ఉంది. మొత్తానికి చూస్తే వైసీపీ పాత రెడ్లు పాత కాపులు పాత నేతలు ఎపుడు లైమ్ లైట్ లోకి వస్తారు అన్నది ఒక ప్రశ్నగా ఉంటే అసలు వైసీపీలో మెజారిటీ లీడర్లలో చురుకుదనం పుట్టేది ఎపుడు అన్నది కూడా మరో ప్రశ్నగా ఉంది.

# షోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యం




హైదరాబాద్,షోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మిషన్ మోడ్‌లో పనిచేస్తుందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. శక్తివంతమైన, ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో అందరూ పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. సమిష్టి కృషితోనే పౌష్టిక తెలంగాణ సాధ్య పడుతుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు దేశానికే ఆదర్శంగా తెలంగాణ అంగన్వాడీ కేంద్రాలను తీర్చి దిద్దుతామని వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ –2047 డాక్యుమెంట్ కు అనుగుణంగా అంగన్వాడీ సేవలను మరింత మెరుగు పరుస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడి సేవల బలోపేతం, చిన్నారుల్లో పోషకాహార మెరుగుదల, మహిళా స్వయం సహాయక బృందాల భాగస్వామ్యం వంటి అంశాలపై రాష్ట్రస్థాయి సమావేశం బేగంపేటలోని టూరిజం ప్లాజా వేదికగా సోమవారం నాడు ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి మంత్రి సీతక్క అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పోషకారంపై పనిచేస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్, సీఎఫ్‌టిఆర్‌ఐ (మైసూర్), ఎయిమ్స్, ఇక్రిసాట్, యూనిసెఫ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రథం, ఆంధ్ర మహిళా సభ, హర్మన్, బాల రక్షభారతి వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోషకాహారం అందించడం లో లైన్ డిపార్ట్ మెంట్లు–గా వ్యవహరిస్తున్న పలు సంక్షేమ శాఖలు, సివిల్ సప్లైస్, విద్యా శాఖ, టీజీ ఫుడ్స్, సెర్ప్, ఐ అండ్ పీఆర్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొని తమ విలువైన అభిప్రాయలు తెలియ చేశారు. వారి అభిప్రాయలను, అనుభవాలను, ఆలోచనలను ఆసక్తిగా విన్న మంత్రి సీతక్క వారి సూచనలతో తెలంగాణ పోషకాహార ప్రణాళిక రూపొందిస్తామని ప్రకటించారు. అంగన్వాడీ లబ్ధిదారులకు రోజుకు 200 మిల్లీ లీటర్ల విజయ పాలు, కిశోర బాలికలకు పోషకాలతో కూడిన పల్లీ, తృణ ధాన్య పట్టీలు, వారానికి రెండు సార్లు ఎగ్ బిర్యానీ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..పోషకాహార తెలంగాణ నిర్మాణం దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో భాగస్వామ్య పక్షాలతో సమావేశం నిర్వహించినట్లు– వెల్లడించారు. నిపుణుల అభిప్రాయాలను, అనుభవాల ఆదారంగా పోషణ తెలంగాణ కోసం కార్యాచరణను రూపొందించి, అమలు చేస్తామని తెలిపారు. తెలంగాణ లో అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను వివరించారు. ప్రజా ప్రభుత్వంలో అంగన్వాడీ కేంద్రాల సేవల్లో తీసుకొచ్చిన మార్పులను వివరించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అంగన్వాడీల్లో ఎన్నో పోషకాలున్న కోడిగుడ్డు సరఫరాను నిలిపి వేయగా..తెలంగాణలో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, కౌమార బాలికలకు పోషకాహారం అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు– చెప్పారు. నిపుణుల సలహ మేరకు అన్ని వయసుల వారికి పౌష్టికాహారం అందించే అంశం పరిశీలనలో ఉందన్నారు. అన్ని రంగాల్లో ముందజలో ఉన్న తెలంగాణలో పోషకార లోపంతో పిల్లలు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు– వెల్లడించారు. పోషకాహార లోపాన్ని అధిగమిం చేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు– తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, మహిళా స్వయం సహాయక బృందాల సహకారాన్ని తీసుకుంటామన్నారు. అంగన్వాడీలపై తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంచేలా సేవల నాణ్యత పెంచుతున్నామని చెప్పారు. అమ్మ ఒడి నుంచి చిన్నారులు అంగన్వాడి బడి లో చేరేలా ప్రోత్సహించాలని కోరారు. అంగన్వాడీల్లో ఆహారంతో పాటు– అక్షరం, ఆరోగ్యం లభిస్తుందని పేరెంట్స్ కు తెలియ జెప్పాలని సూచించారు. ఇక నిర్మాణ సౌకర్యం లేని ప్రాంతాల్లో మొబైల్ అంగన్వాడీలను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. నాక్, జె ఎన్‌టీయూ వంటి సంస్థలు మోడల్స్ సిద్ధం చేస్తున్నట్లు– తెలిపారు. హైదరాబాద్ లో వలస కూలీల పిల్లలకు పౌష్టికాహారం అందించేలా మొబైల్ అంగన్వాడీలు నిర్వహిస్తామన్నారు. వారానికి కనీసం రెండు సార్లు అయా ప్రాంతాల్లో పోషకాహారన్ని అందిస్తామని తెలిపారు. ఇక అంగన్వాడీ కేంద్రాలను దత్తత తీసుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ఆసక్తిని తెలిపిన నేపథ్యంలో అవసరమైన ప్రోత్సాహక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణానికి ఆరోగ్యవంతమైన చిన్నారులే కీలకమన్నారు. అందుకే అంగన్వాడి కేంద్రాల సేవలపై పూర్తి దృష్టి సారించాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. అంగన్వాడి సిబ్బంది స్పష్టమైన లక్ష్యంతో పనిచేస్తే ఫలితాలు మెరుగ్గా వస్తాయని పేర్కొన్నారు. మంత్రి సీతక్క ప్రత్యేకంగా పోషన్ వాటిక కార్యక్రమం కింద నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా ఆరు రకాల కూరగాయల విత్తనాలతో కూడిన సీడ్స్ కిట్‌ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు.

# పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి అకస్మాత్తుగా ఏమైంది?



హైదరాబాద్,ఆయన విజయవంతమైన వ్యాపారి.. ఆ తర్వాత విజయవంతమైన రాజకీయవేత్త.. అప్పట్లో తెలంగాణ రాష్ట్రంలో కారు జోరు కొనసాగుతున్నప్పుడు.. దానిని ఫ్యాన్ గాలి ద్వారా ఆపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2014లో జరిగిన ఎన్నికల్లో ఫ్యాన్ పార్టీ హవా చూపించారు. ఏకంగా అశ్వరావుపేట, వైరా ఎమ్మెల్యేలను గెలిపించుకొని సంచలనం సృష్టించారు. అంతేకాదు తను కూడా పార్లమెంట్ సభ్యుడిగా గెలిచి రికార్డు సృష్టించారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆయన కారులో కూర్చున్నారు. కొంతకాలానికి అందులో నుంచి బయటికి వచ్చారు. హస్తం పార్టీలో కీలక నాయకుడిగా కొనసాగుతున్నారు. ఇ ప్పుడు వ్యాపారాన్ని కొడుకు చూస్తున్నారు. రాజకీయాన్ని ఆయన చేస్తున్నారు. అంతేకాదు కాంగ్రెస్ పార్టీలో ఎవరికి సాధ్యం కాని విధంగా ఎమ్మెల్యే అయిన తొలిసారే ఏకంగా రెవెన్యూ మంత్రి అయ్యారు. అంతేకాదు ప్రభుత్వంలో అత్యంత కీలకమైన సమాచార పౌర సంబంధాల శాఖను తీసుకున్నారు. అంతేకాదు కేసీఆర్ మానస పుత్రిక అయిన ధరణిని బంగాళాఖాతంలో కలిపి భూభారతిని తెరపైకి తీసుకువచ్చారు.. భూభారతి అమల్లో వేగవంతమైన అడుగులు వేస్తున్నారు. తద్వారా రెవెన్యూ శాఖ మంత్రిగా మంచి పేరు తెచ్చుకుంటున్నారు.. ఇలాంటి క్రమంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒకసారిగా తన రూట్ మార్చారు. ఈ మాట అన్నది సాక్షాత్తు ఆయన పార్టీ నాయకులు.. ఆయనను అనుసరించే వ్యక్తులు. సోమవారం తన సొంత నియోజకవర్గమైన పాలేరులో పొంగులేటి పర్యటించారు.. ఈ స్థానంలో గెలిచిన తర్వాత అనేక పర్యాయాలు పొంగులేటి పర్యటించారు. పర్యటిస్తూనే ఉంటారు. అయితే ఈసారి ప్రజలకు మాత్రం ఒక ప్రత్యేకత ఉంది. అదేంటంటే ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తో కలిసి ఆయన తన నియోజకవర్గంలో పర్యటించారు.. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క మంత్రులుగా కొనసాగుతున్నారు. అయితే ఇప్పటివరకు ఈ ముగ్గురు నాయకులు కలిసి పర్యటించారు. వేరువేరుగా పర్యటించారు. అయితే పాలేరు నియోజకవర్గంలో మాత్రం భట్టివిక్రమార్కను ప్రత్యేకంగా ఆహ్వానించారు పొంగులేటి. అంతేకాదు అధికారికంగా భారీ ఎత్తున ఒక కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఇది రాజకీయంగా చర్చకు దారి తీస్తోంది.. నాగార్జునసాగర్ లోని ఎడమ ప్రధాన కాలువ కింద అంతర్గత కాలువ పనులను ఇటీవల యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. సాగర్ ఎడమ కాలువ పరిధిలోని ఆయకట్టుకు రెండవ జోన్ ద్వారా భట్టితో కలిసి పొంగులేటి నీటిని విడుదల చేశారు. అంతర్గత కాల్వపనులను గత రాత్రి మంత్రి పరిశీలించారు. అప్పటికప్పుడు అక్కడి నుంచి డిప్యూటీ సీఎం కు ఫోన్ చేశారు. తన సెగ్మెంట్ కు రావాలని కోరారు. వాస్తవానికి డిప్యూటీ సీఎం ఖమ్మం టూర్ లో పాలేరు లో కార్యక్రమం లేదు. మధిరలోని చింతకాని మండలంలో మాత్రమే భట్టి అఫీషియల్ టూర్ డిక్లేర్ అయింది. పొంగులేటి మంత్రి అయిన తర్వాత తొలిసారి భట్టిని తన నియోజకవర్గానికి పిలిపించి అధికారికంగా కార్యక్రమాన్ని నిర్వహించడం ఆసక్తికరంగా మారింది. ఎందుకంటే ఇప్పటివరకు పొంగులేటి నియోజకవర్గం లో భట్టి పర్యటించలేదు. వీరిద్దరూ కలిసి అసలు పర్యటించలేదు. అయితే వీరిద్దరూ ఒకే వేదికను పంచుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటి? అనే ప్రశ్నకు ఇప్పటికిప్పుడు సమాధానం లభించకపోవచ్చు. ఎందుకంటే రాజకీయంగా భట్టి నిశ్శబ్దంగా ఉంటారు. ఆయన మదిలో ఏ ఆలోచన ఉందా అనేది ఎవరికీ అంతు పట్టదు. ఇక పొంగులేటి కొన్నిసార్లు ఓపెన్ అవుతుంటారు. తన మదిలో ఉన్న ఆలోచనను బయటపెడుతుంటారు.

# దత్తన్నకు రిటైర్మెంట్.. ఇచ్చినట్లేనా.. ?



న్యూఢిల్లీ,ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే, రాజకీయ నియామకాలపై దృష్టిని కేంద్రీకరించారు. అందులో భాగంగా, నిన్న వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన నలుగురు ప్రముఖులను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యసభకు నామినేట్ చేశారు. ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్, మాజీ విదేశాంగ కార్యదర్శి హర్ష్ శ్రింగ్లా, కేరళ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త సి. సదానందన్ మాస్టర్, ప్రఖ్యాత చరిత్రకారిణి మీనాక్షి జైన్‌లు పార్లమెంటు ఎగువ సభకు నామినేట్ అయిన వారిలో ఉన్నారు. అలాగే, మూడు రాష్ట్రాలకు గవర్నర్‌లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉ త్తర్వులు జారీ చేశారు. హర్యానా గవర్నర్‌గా ఆషింకుమార్ ఘోష్, గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజు,లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవిందర్ గుప్తాలను రాష్ట్రపతి నియమించారు. ఇందులో, గోవా గవర్నర్‌గా నియమితులైన అశోక గజపతి రాజు టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలోనూ, ప్రభుత్వంలోన, పలు హోదాల్లో పని చేశారు. అశోక్ గజపతి రాజు ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి ఎంపీగా ఎన్నికయ్యారు. ఎన్టీఆర్, చంద్రబాబు మంత్రివర్గాలలో కీలక శాఖలు నిర్వహించారు. 2014 లో విజయనగరం ఎంపీగా గెలిచిన ఆయన ప్రధాని మోదీ ఫస్ట్ కాబినెట్' లో కేబినెట్ మంత్రి హోదాలో విమానయాన శాఖ నిర్వహించారు. ఇదే సమయంలో, ప్రస్తుతం హర్యానా గవర్నర్'గా ఉన్న బండారు దత్తాత్రేయ స్థానంలో ప్రొఫెసర్ ఆషిమ్ కుమార్ ఘోష్'ను ఆ రాష్ట్ర నూతన గవర్నర్ గా నియమించారు. దత్తాత్రేయ హిమాచల్' ప్రదేశ్ 2019–21), హర్యానా (2021–25)గవర్నర్'గా మొత్తం ఏడేళ్లు సేవలు అందించారు. ఆర్ఎస్ఎస్ ప్రచారక్'గా సుదీర్ఘ కాలం పని చేసిన దత్తాత్రేయ బీజేపీలోనూ పలు హోదాల్లో పని చేశారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. వాజ్ పేయ్, మోదీ ప్రభుత్వాలలో మంత్రిగా పని చేశారు. ప్రస్తుతం హర్యానా గవర్నర్'గా ఉన్న ఆయన పదవీ కాలం ముగియటంతో ఇప్పుడు అక్కడ కొత్త గవర్నర్'ను నియమించారు. దీంతో.. ఇప్పుడు దత్తాత్రేయను మరో రాష్ట్రానికి గవర్నర్ గా నియమిస్తారా లేక 78 ఏళ్ల దత్తన్నకు రిటైర్మెంట్' ఇస్తారా అనేది, చూడవలసి వుంది. ఇక.. రాష్ట్రానికి ప్రథమ పౌరుడిగా భావించే గవర్నర్ పదవిని చేపట్టిన వారిలో తెలుగువారు చాలా మందే ఉన్నారు. ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర వంటి పెద్ద రాష్ట్రాల రాజ్‌భవన్‌లో తెలుగు వారు గవర్నర్లుగా ఆశీనులయ్యారు. అందులో తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులుగా చేసిన ప్రముఖులు కూడా ఉన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఇప్పటివరకూ మొత్తం 20 మంది వివిధ రాష్ట్రాలకు గవర్నర్లుగా పనిచేశారు. అలాగే ఒడిశా, తమళినాడులోని తెలుగు కుటుంబాల్లో జన్మించిన ఇద్దరితోపాటు తెలుగింటి కోడలుగా వచ్చి ఒకరు కూడా గవర్నర్లుగా పనిచేశారు. అంతేకాకుండా వీరిలో పలువురు ఏకకాలంలో వివిధ రాష్ట్రాల్లో గవర్నర్లుగా ఉన్నారు. ప్రస్తుతం అశోక గజపతి రాజుతో సహా ముగ్గురు తెలుగు వారు, మూడు రాష్ట్రాల ప్రథమ పౌరులుగా గౌరవం అందుకుంటున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com